

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితా ప్రకారం రెండో విడత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం ఉక్కు నగరంలోని విశాఖ విమల విద్యాలయంలో నిర్వహించారు. మొత్తం 82 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారి కోసం నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. వెరిఫికేషన్ ప్రక్రియను విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పర్యవేక్షించారు. కాగా, కాల్ లెటర్‌లు అందుకున్న అభ్యర్థులు పలువురు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నందున బుధవారం వచ్చేందుకు అవకాశం కల్పించారు.

ప్రతి 6 నెలలకు మారీటైమ్ సదస్సు



సమావేశ మందిరంలోకి వస్తూ పారిశ్రామికవేత్తలకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచన

- డేటా సెంటర్‌గా అభివృద్ధి చెందనున్న విశాఖ
- నగరంలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి విశాఖపట్నంలో ఆరు నెలలకొకసారి మారీటైమ్ సదస్సు ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ అండ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో ఆయన ఈ సూచన చేశారు. లాజిస్టిక్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ఇక్కడి పారిశ్రామికవేత్తలను కోరారు. గ్లోబల్ లాజిస్టిక్స్ వ్యయం 8 శాతం ఉండగా, భారతదేశంలో ఇది 13 శాతంగా ఉందని, ఈ వ్యయం బాగా దిగి రావడానికి అంతా కృషి చేయాలన్నారు. విశాఖలో జీఎంఆర్ సంస్థ ... మిగతా 8వ పేజీలో

28 పంచాయతీలకు సొంత భవనాలు



- రూ.8.96 కోట్లు మంజూరు
- పీఆర్ ఈఈ శివప్రసాద్

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్తగా 28 గ్రామ పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.8.96 కోట్లు కేటాయించిందని పంచాయతీరాజ్ శాఖ ఈఈ ఎన్.శివప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ, పలు గ్రామాల్లో పంచాయతీలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతుండడంతో ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని చెప్పారు. ఈ మేరకు ఆయా పంచాయతీలకు నిధులు విడుదల చేస్తూ పరిపాలన పరమైన ఆమోదం లభించిందని తెలిపారు. ఒక్కో భవనానికి రూ.32 లక్షలు మంజూరయ్యాయని, ఇందులో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.7 లక్షలు, రాష్ట్రీయ గ్రామీణ సమృద్ధి ఆవాస యోజన నిధులు రూ.25 లక్షలు వుంటాయన్నారు. నియోజకవర్గాల వారీగా పంచాయతీలను ఎంపిక చేసిన తరువాత భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.178.37 కోట్ల అంచనాలతో 1,808 నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

ఇద్దరు టీచర్లకు చార్జిమెమోలు

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అలసత్వం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాకాధికారి గిడ్డి అప్పారావునాయుడు సోమవారం చార్జి మెమోలు జారీ చేశారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ఎస్ ప్రసన్నకళ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసినట్టు విచారణలో తేలడంతో ఆమెకు నోటీసు జారీ చేశారు. రావికమతం మండలానికి చెందిన ఉపాధ్యాయిని షేక్ బషీర్‌బీబీ స్టడీ లీవ్‌లో ఉన్నారు. ఇటీవల ఆమెకు పోస్టింగ్ ఇచ్చినా విధుల్లో చేరలేదు దీనిపై విచారణ నిర్వహించిన రావికమతం తహశీల్దారు లింగమూర్తి నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా ఆమెకు చార్జి మెమో జారీ చేశారు. వీరిద్దరు లిఖితపూర్వకంగా ఇచ్చిన వివరణ అనంతరం శాఖాపరంగా తగు చర్యలు ఉంటాయని డీఈఓ తెలిపారు.

అనకాపల్లి వద్దు బాబోయ్!

జిల్లా కేంద్రంలో తహశీల్దారుగా పనిచేయడానికి భయపడుతున్న అధికారులు

- రాజకీయ నేతల నుంచి తట్టుకోలేని ఒత్తిళ్లు
- దీర్ఘకాలిక సెలవుపై తహశీల్దారు భాస్కర అప్పారావు



అనకాపల్లి తహసీల్దారు కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో తహశీల్దారు ఉద్యోగమంటే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఇక్కడ తహశీల్దారుగా పనిచేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతారు. కానీ కొంతకాలంగా ఇక్కడ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. అనకాపల్లి తహశీల్దారు పోస్టు అంటేనే వెనకడుగు వేస్తున్నారు. స్థానిక నేతల ఒత్తిళ్లే ఇందుకు ప్రధాన కారణమని తెలిసింది.

మూడు నెలల కిందట జరిగిన బదిలీల సందర్భంగా అనకాపల్లి తహశీల్దారుగా వచ్చేందుకు ఒక్కరు కూడా ఆప్షన్ ఇవ్వలేదు. దీంతో ఆర్డీఓ కార్యాలయం ఏఓ.. తహశీల్దారు విధులు నిర్వహించారు. పరిపాలన పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ విజయకృష్ణన్ చొరవ తీసుకొని ఎస్.రాయవరం తహశీల్దారుగా పనిచేస్తున్న విజయకుమార్‌ను అనకాపల్లికి బదిలీ చేశారు. కొద్ది రోజులకే ఆయనపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోవడంతో కలెక్టరేట్ ఏఓగా బదిలీ చేయించుకున్నారు. తరువాత అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన భాస్కర అప్పారావును అనకాపల్లి తహశీల్దారుగా నియమించారు. ఆయన కూడా ఇక్కడ ఎక్కువ రోజులు పనిచేయలేక పోయారు. స్థానిక నేతల నుంచి తీవ్ర ఒత్తిళ్లు రావడంతో రెండు రోజుల కిందట అనారోగ్య సమస్యల పేరుతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు.

అనకాపల్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్, 22ఏ జాబితా నుంచి భూముల తొలగింపు, పట్టాదారు పాసు పుస్తకాలు జారీ, మ్యుటేషన్‌లు, ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపుల్లో బినామీ పేర్లు చేర్చడం వంటివి పెరిగాయి. కోడూరు, కుంచంగి, కూండ్రం, అనకాపల్లి ఆవఖండం పరిసరాల్లో భూముల ధరలు పెరగడంతో క్రయవిక్రయాలు పెరిగాయి. జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ భూముల ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పులు చేయాలని తీవ్రఒత్తిడి తేవడం వల్లే తహశీల్దారు భాస్కర అప్పారావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయినట్టు తెలిసింది. జిల్లా అధికారులు ... మిగతా 8వ పేజీలో

లక్ష్యం దిశగా వరి సాగు

కీలక సమయంలో కరుణించిన వరుణుడు

- రెండు వారాల నుంచి కురుస్తున్న వర్షాలతో జోరుగా నాట్లు



రోలుగుంటలో వరినాట్లు పూర్తికావడంతో పచ్చగా కళకళలాడుతున్న పొలాలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. గత రెండు వారాల నుంచి కురుస్తున్న వర్షాలతో చెరువులు, జలాశయాలు నిండుకుండల్లా మారాయి. చాలాచోట్ల కాలువల నీటి అవసరం లేకుండా, పొలాల్లో చేరిన వర్షం నీటితోనే వరినాట్లు వేసుకుంటున్నారు. నీటి వసతి వున్న ప్రాంతాలతోపాటు వర్షాధార భూముల్లో కూడా వరినాట్లు వేస్తుండడంతో పరిస్థితి ఆశాజనకంగా వుంది. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 54,465 హెక్టార్లలో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. సెప్టెంబరు ఒకటో తేదీ నాటికి 41,546 హెక్టార్లలో వరినాట్లు పూర్తయినట్టు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నాతవరం మండలంలో 4,590 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. తరువాత దేవరాపల్లి మండలంలో 3,812 హెక్టార్లు, మాడుగుల మండలంలో 3,638, కె.కోటపాడులో 2,453, చీడికాడలో 2,872, అనకాపల్లిలో 2,100, రావికమతంలో 2,097, పాయకరావుపేటలో 2,036, బుచ్చెయ్యపేటబ 1,882, ఎస్.రాయవరంలో 1,842, నర్సీపట్నంలో 1,516, రోలుగుంటలో 1,518, నబ్బవరంలో 1,140, గొలుగొండలో 1,074, నక్కపల్లిలో 1,334, కోటవురట్లలో 1,271, మాకవరపాలెంలో 1,115, కశింకోటలో 640, మునగపాకలో 971, చోడవరంలో 1,698, ఎలమంచిలిలో 762 అచ్యుతాపురంలో 320, రాంబిల్లిలో 738, పరవాడలో 123 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన విస్తీర్ణంలో వారం రోజుల్లో వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



రావికమతంలో నాట్లు వేయడానికి వరినారు తీస్తున్న మహిళా కూలీలు

చోడవరం సీహెచ్‌సీకి మహర్దశ

- చోడవరం సహా తొమ్మిది ఆస్పత్రులకు రూ.51.75 కోట్లు కేటాయింపు
- పెరగనున్న వైద్య నిపుణులు, సిబ్బంది
- రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు

30 పడకల నుంచి 100 పడకలకు పెంచిన ప్రభుత్వం



చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రం

చోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): **స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) దశ మారనున్నది. ఇప్పటి వరకు 30 పడకలకే పరిమితమైన ఈ వైద్యశాల.. త్వరలో వంద పడకల స్థాయికి పెరగనుంది. ఈ మేరకు వసతులు, సదుపాయాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చోడవరంతోపాటు రాష్ట్రంలో మొత్తం తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పడకల పెంపు, వసతుల కల్పనకు రూ.51.75 కోట్లు కేటాయించింది.**

చోడవరం నియోజకవర్గంతోపాటు మాడుగుల నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న చోడవరం సీహెచ్‌సీ.. రిఫరల్ ఆస్పత్రిగానే ఉండిపోయింది. నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తున్నప్పటికీ సౌకర్యాలు అంతంతమాత్రంగానే వున్నాయి. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సౌకర్యాలు లేకపోవడంతో ఎమర్జెన్సీ కేసులను అనకాపల్లి లేదా విశాఖపట్నం రిఫర్ చేస్తున్నారు. అయితే కొంతమంది అంత దూరం వెళ్లలేక పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గతంలో టీడీపీ అధికారంలో (2014-19) వున్నప్పుడు రూ.2.5 కోట్లు మంజూరు చేయడంతో నూతన భవనాలు నిర్మించి ... మిగతా 8వ పేజీలో

మరింత మంది వైద్య నిపుణులు, సిబ్బంది

ఆస్పత్రిలో పడకల సంఖ్య పెరిగితే ఆ మేరకు అదనంగా వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం నియమిస్తుంది. ప్రస్తుతం ఇక్క పీడియాట్రిక్స్, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆస్పత్రి స్థాయి పెరిగితే ఈఎన్‌టీ, ఆర్థో, ఆప్తాలమిక్ తదితర నిపుణులను ప్రభుత్వం నియమిస్తుంది. ఎక్స్‌రే యూనిట్‌ను నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకువస్తాం.

- సిరికి దినేశ్‌కుమార్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్

సిందూర వర్ణంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన మంగళవారం చోడవరం విఘ్నేశ్వరాలయంలో స్వయంభూ గణేశుడు సందూర వర్ణంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. తరువాత భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

-చోడవరం/ ఆంధ్రజ్యోతి



సిందూర వర్ణంలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

గౌరీపట్నం రోడ్డులో వాహనాల రద్దీ

విజయరామరాజుపేట వద్ద పునరుద్ధరణకు నోచుకోని కాజ్‌వే

- చోడవరం- వడ్డాది మధ్య వాహనాల మళ్లింపు
- గౌరీపట్నం రహదారి చిన్నది కావడంతో స్తంభిస్తున్న ట్రాఫిక్
- వాహనదారులు, ప్రయాణికుల అవస్థలు



గౌరీపట్నం రోడ్డులో మంగళవారం ఉదయం స్తంభించి ట్రాఫిక్

చోడవరం/బుచ్చెయ్యపేట, సెపెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేట వద్ద తాచేరు గెడ్డపై వున్న కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోవడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు మండలాలకు చెందిన ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ధాటికి కాజ్‌వే చాలా వరకు దెబ్బతినడం, నీటి ప్రవాహం ఇంకా కొనసాగుతుండడంతో పునరుద్ధరణ పనులు ఎప్పుడు చేపట్టేదీ అధికారులు చెప్పలేకపోతున్నారు. బీఎన్ రోడ్డు చోడవరం-వడ్డాది మధ్య రాకపోకలు సాగించే వాహనాలు వేరే మార్గాల్లో నుంచి వెళ్లాల్సి వస్తున్నది. వడ్డాది నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను గౌరీపట్నం మీదుగా మళ్లించారు. ఈ రహదారి చిన్నది కావడం, పలుచోట్ల మలుపులు వుండడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. మంగళవారం ఉదయం ఇరువైపుల నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్‌లు, స్కూల్ బస్సులు ఎదురెదురుగా రావడంతో తప్పుకునే అవకాశం లేక చాలాసేపు నిలిచిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విజయరామరాజుపేట వద్ద కాజ్‌వేను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

రైల్వే గేటుతో పాట్లు

ఏటికొప్పాక వద్ద ఎక్కువ సమయం మూసే ఉంటున్న గేటు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు
- అండర్ పాస్ నిర్మించి సమస్య తొలగించాలని వినతి



ఏటికొప్పాక సమీపంలో రైలు గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనదారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏటికొప్పాక- పులపర్తి రోడ్డులో రైల్వే గేటు తరచూ మూసివేయాల్సి రావడంతో మూడు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలమంచిలి మండలం ఏటికొప్పాక, ఎస్.రాయవరం మండలం దార్లపూడి, కోటవురట్ల మండలం పందూరు, రామచంద్రపురంతోటు సమీప శివారు గ్రామాల ప్రజలు ఎలమంచిలితోపాటు జిల్లా కేంద్రం అనకాపల్లి వెళ్లాలంటే ఈ మార్గంలోనే ప్రయాణించాలి. ఏటికొప్పాక దాటిన తరువాత రైల్వే గేటు వుంది. రైళ్ల రాకపోకల సమయంలో గతంలో ఇక్కడ రోజులో సగటున ఆరేడు గంటలపాటు గేటు వేసేవారు. కాలక్రమేణా రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో రోజులో దాదాపు పది గంటలపాటు గేటు మూసివుంటున్నది. కొన్నిసార్లు ఇరువైపుల నుంచి వరుసగా రైళ్లు వస్తుండడంతో చాలా సేపు గేటు తీయడంలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు సకాలంలో కళాశాలలు, ప్రైవేటు విద్యా సంస్థలకు హాజరు కాలేకపోతున్నారు. గేటు పడినప్పుడు వర్షం కురుస్తుంటే.. ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇక వేసవిలో ఎండ వేడి, ఉక్కపోతతో అన్ని రకాల వాహనాల్లో ప్రయాణించే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏటికొప్పాక వద్ద ప్రస్తుతం వున్న గేటు స్థానంలో అండర్‌పాస్ నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైవాడకు కొనసాగుతున్న వరద

దేవరాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం నుంచి మంగళవారం కూడా నీటి విడుదల కొనసాగింది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా జలాశయంలోకి సుమారు 900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. నీటి మట్టాన్ని 113.55 మీటర్లు వద్ద స్థిరంగా వుంచుతున్న అధికారులు ఒక గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ఎడమ, కుడి కాలువల నుంచి ఆయకట్టుకు 150 క్యూసెక్కులు, జీవీఎంసీ తాగునీటి అవసరాలకుం 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు డీఈఈ తెలిపారు.



రైవాడ స్పిల్‌వే గేటు నుంచి నదిలోకి విడుదల అవుతున్న నీరు

మట్టిలో మాణిక్యం

- పారా వాలీబాల్ క్రీడలో రాణిస్తున్న గణేశ్
- గత ఏడాది ప్రపంచ కప్ పోటీల్లో భారత్‌కు రజత పతకం రావడంలో కీలక భూమిక

- 8లో



అన్నం గణేశ్

రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

పాయకరావుపేట రూరల్, ఆగస్టు2 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదును చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని పెంటకోట, మాసాహెబ్‌పేట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రైతులు ఈ-పంట నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వం అందించే పంట నష్టం, పంట బీమా, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అందవన్నారు. ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో నాగమణి, వ్యవసాయ సిబ్బంది కల్పన, రైతులు పాల్గొన్నారు.

కైట్స్ కళాశాలలో బ్రాండిక్స్ క్యాంపస్ డ్రైవ్



కైట్స్ కళాశాలలో జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొన్న అభ్యర్థులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కైట్స్ కళాశాలలో మంగళవారం బ్రాండిక్స్ యాజమాన్యం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన 300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి మౌఖిక, రాత పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో రూ. 15 వేలు ఉపకార వేతనం (స్టైఫండ్), శిక్షణ పూర్తయిన తర్వాత ప్రమోషన్ ఆధారంగా రూ.25 వేలు వేతనం ఇస్తారని బ్రాండిక్స్ యాజమాన్యం ప్రకటించింది. బ్రాండిక్స్ కర్మాగారం ప్లేస్‌మెంట్ అధికారి షహజాది, హెచ్‌ఆర్ అమూల్య ఈ క్యాంపస్ డ్రైవ్‌ని నిర్వహించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎలమంచిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ నిర్వహణ పనుల్లో భాగంగా ఈనెల 3వ తేదీన మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం, వెంకటాపురం, రెల్లికాలనీ, పులపర్తి, పీఎన్‌ఆర్‌పేట, బయ్యవరం, క్రిష్ణాపురం, నాయనమ్మపాలెం, పోతిరెడ్డిపాలెం, పురుషోత్తపురం, రుక్మిణిపురం, రేగుపాలెం, వెంకునాయుడుపాలెం, లైనుకొత్తూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

భూసేకరణలో స్పష్టత లేదు

▸▸ తహశీల్దార్‌ను ఆశ్రయించిన నిర్వాసితులు



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

మునగపాక, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణలో స్పష్టత లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నిర్వాసితులు మంగళవారం తహశీల్దార్ పి.సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంత పోతుందో, పరిహారం ఇచ్చేదెంతో తెలియజేయాలని నిర్వాసితులు ఎస్.బ్రహ్మాజీ, శ్రీనివాసనాయుడు తదితరులు డిమాండ్ చేశారు. రెండు పర్యాయాలు నోటిఫికేషన్ విడుదల చేశారని, కొలతల్లో కూడా పలు మార్లు మార్పులు, చేర్పులు చేశారన్నారు. అనుమానాలను నివృతి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ నిర్వాసితులు ఎవరూ ఎటువంటి ఆందోళన చెందవద్దని, సేకరణకు సంబంధించి ఎటువంటి అనుమానం ఉన్నా తనను సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి

మునగపాక, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల సంరక్షణ, పోషకాహారం అందజేయడం, పంపిణీ తదితర అంశాల్లో నిజాయితీగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న సొసైటీ చైర్‌పర్సన్ బుజ్జి, సర్పంచ్ వీరబాబు

నక్కపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందుతున్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎన్‌డీఏ ప్రభుత్వం మంజూరు చేస్తోందని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి అన్నారు. మంగళవారం ఉపమాక సచివాలయంలో గ్రామానికి చెందిన ప్రగడ లక్ష్య అనే బాలికకు అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు రూ లక్ష ఖర్చు చేశారు. హోం మంత్రి చొరవతో బాధితురాలకు రూ. 54 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ మేరకు కొప్పిశెట్టి బుజ్జి, సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఉపమాక గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీను, యలమంచిలి రమణబాబు, కొప్పిశెట్టి వాసు తదితరులు చెక్‌ను అందజేశారు.

హరిపాలెం పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో తనిఖీ



ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం. హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల వివరాలు, ల్యాబ్‌లోని పరీక్షలను వైద్యాధికారి డాక్టర్ రవిబాబును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యాధి నిరోధక టీకాలు లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలని, కిషోర్ బాలికలు, బడిఈడు పిల్లలో రక్తహీనత లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, సిబ్బంది గణేష్, శోభ, శిరీషా, ఆరోగ్య, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



అచ్యుతాపురం: కొండకర్లలో దివ్యాంగులకు కేక్‌ని తినిపిస్తున్న ఎమ్మెల్యే సుందరపు



కోటవురట్ల ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న శివదత్త, జానకిశ్రీనివాసరావు

ఎలమంచిలి/రాంబిల్లి/పాయకరావుపేట/అచ్యుతాపురం/మునగపాక/కోటవురట్ల/నక్కపల్లి/ఎస్.రాయవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల్లో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం అట్టహాసంగా జరిగాయి. ఎలమంచిలి పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. అనంతరం సీహెచ్‌సీలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బొద్దపు శ్రీను, లవుడు లోవరాజు, కర్రి ఝాన్సీ, అన్నం బాబ్జీ, కొఠారు శ్రీను, ఊటకూటి రమేష్, గుర్రాల శేఖర్, కొఠారు నరేష్, జయరామ్, చిట్టిబాబు పాల్గొన్నారు. రాంబిల్లి మండలంలోని హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పప్పల నూకన్నదొర, బైలపూడి శ్రీరామరాజు, జనపరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే జనసేన మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, ఆ పార్టీ నేతలతో కలిసి పంచదార్ల పుణ్యక్షేత్రంలో పవన్‌కల్యాణ్ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్యక్షేత్రం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రాంబిల్లి ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. పాయకరావుపేట మెయిన్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం, పీహెచ్‌సీల వద్ద నామవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెడ్డం కన్నబాబు, భూమి కాలువ చైర్మన్ గెడ్డం చైతన్య, యూత్ నాయకుడు గెడ్డం ఆకాష్ తదితరులు పవన్ కల్యాణ్ పుట్టిన రోజు కేక్‌ని కట్ చేసి, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభిమానులు భారీగా బాణసంచా పేల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎగదాశి నానాజీ, ఆచంట దొర, జగ్గన్నదొర, పల్లి దుర్గారావు, నారపురెడ్డి పద్మ, కర్రి బాబూరావు, గీసాల పద్మ, మహలక్ష్మి, గౌరి, నాగమల్లి, తదితరులు పాలొన్నారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ స్థానిక సమత సీడీ ప్రాజెక్ట్ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం పవన్‌కల్యాణ్ బర్త్ డే కేక్‌ను తోట నగేశ్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమత ప్రాజెక్ట్ ప్రతినిధులు అనిల్, చక్రధర్, యేసు, వార్డు సభ్యులు పల్లా ప్రసాద్, దేవాది మంగాదేవి, తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ, కొండకర్లలో గల ఇచ్ఛా ఫౌండేషన్‌లలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాల్లో బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, మోటూరు శ్రీవేణి, కరెడ్ల సూర్యప్రకాష్, పిన్నమరాజు వాసు, కోట్ని శివ, పుర్రే శ్రీనివాస యాదవ్, కూండ్రపు రమణ, తదితరులు పాల్గొన్నారు. మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం కేక్ కట్ చేసి పంచారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో జనసైనికులు మొల్లేటి ఆనంద్, పాలిపిని రాము, బొడ్డేడ అప్పలనాయుడు, కాండ్రేగుల గాంధి తదితరులు పాల్గొన్నారు. కోటవురట్లలో పౌర సరఫరాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శివదత్త కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జానకి శ్రీనివాసరావు, జనసేన బత్తుల బాబూరావు, జవ్వాది బద్రి, కోనేటి రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.నక్కపల్లి జనసేన కార్యాలయం వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గొడిచెర్ల, ఉపమాక గ్రామాల్లో కూడా పవన్ బర్త్ డే వేడుకలను జనసైనికులు జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ఆయన పేరుతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆకేటి గోవిందరావు, కురందాసు అప్పలరాజు, చంద్రరావు, పాము గణేశ్, తోట అప్పారావు, నల్ల ల రత్నాజీ, బంగారి రాజు తదితరులు పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలంలోని పెనుగొల్లు పీహెచ్‌సీలో రోగులకు పండ్లను జనసేన మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్ పంపిణీ చేశారు. అనంతరం అక్కడే కేక్ కట్ చేశారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో కుసుమ కావ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనసేన నాయకుడు సేనాపతి బాబూరావు మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తేటకాలి అరవింద్, మాలెం రాజు, గొర్లి సతీష్, వీసం సాయి, పి శివకృష్ణ, ఎస్ నాగేశ్వరరావు, ఆశోక్, లంకా సంతోష్ పాల్గొన్నారు.



పాయకరావుపేట: సమత ఆశ్రమానికి నిత్యావసర సరుకులు, పుస్తకాలు అందజేస్తున్న తోట నగేశ్

వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి



ఎలమంచిలిలో వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

ఎలమంచిలి/కోటవురట్ల/పాయకరావుపేట/రూరల్/అచ్యుతాపురం/మునగపాక/రాంబిల్లి/నక్కపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో మంగళవారం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని వైసీపీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, ఎంపీపీ గోవింద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు నాగ త్రినాథ గుప్తా, కౌన్సిలర్లు, నేతలు వెంకట్, కొల్లి త్రినాథ్, కొఠారు కొండబాబు, మడుగుల సత్యనారాయణ, దుంగా అచ్యుతరావు, దూది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. కోటవురట్లలో వైఎస్‌ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతాబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. శానిటేషన్ సిబ్బందికి చీరలు, పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు పైల రమేష్ పాల్గొన్నారు. పాములవాకలో వైసీపీ మండల కన్వీనర్ కిల్లాడ శ్రీనివాసరావు, పెట్ల రాంబాబు, సిద్దాబత్తుల సత్యనారాయణ, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోరుప్రోలు శివ, కోరుప్రోలు రమణ పాల్గొన్నారు. పాయకరావుపేట మండలంలోని సత్యవరం, మంగవరం, శ్రీరాంపురం, వెంకటనగరం, తదితర గ్రామాలలో రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, సఖిలేటి రాము, తమిర్సి గంగారావు, చోడిపల్లి శ్రీనివాసరావు, రాజు, బోడపాటి గోవిందు, బత్తిన త్రిమూర్తులు, కర్రి వీరబాబు పాల్గొన్నారు. పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం ఎదుట వైఎస్‌ఆర్. విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గెడ్డమూరి శ్రీనివాసరావు, ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబి, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, దేవవరపు వెంకటేశ్వరరావు, కె.సుందరలత, చోడిపల్లి శ్రీను, దేవవరపు రాజేష్‌ఖన్నా, వై.అన్నవరం, తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురంలో వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు ఆధ్వర్యంలో జంగులూరు వద్ద వైఎస్సార్ విగ్రహానికి కరణం ధర్మశ్రీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లాలం రాంబాబు, జువ్వాల నాయుడు, కూండ్రపు వెంకునాయుడు, చేపల శ్రీరాములు, భీముని నాగేశ్వరరావు, గంగిరెడ్ల రాము, మోటూరు సంజీవి పాల్గొన్నారు.



కోటవురట్లలో శానిటేషన్ సిబ్బందికి చీరలు పంపిణీ వైసీపీ నాయకులు

మునగపాకలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, బొద్దపు శ్రీరామ్మూర్తి, దొడ్డి బాలాజి తదితరులు పాల్గొన్నారు. రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి వైసీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిషోర్, జడ్పీటీసీ సభ్యులు దూళి నాగరాజు, వైసీపీ నాయకులు జి.శ్రీనుబాబు, పి.నానిబాబురాజు, నెట్టెం సత్యంనారాయణ, తదితరులు పాల్గొన్నారు.నక్కపల్లిలో మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వీసం రామకృష్ణ తదితరులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నదానం నిర్వహించారు. ఉపమాకలో వైఎస్ విగ్రహానికి కంబాల జోగులు, మండల వైసీపీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాగులో సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతాంగం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అధిక దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు రైతులకు సూచించారు. మంగళవారం మునిసిపాలిటీలోని సోమలింగపాలెం, కట్టుపాలెం వార్డుల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో గ్రామంలో ఆయన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం సాంకేతిక పద్ధతుల్లో చేపట్టాలన్నారు. వరిలో యూరియా వినియోగంలో వ్యవసాయాధికారులు అందించే సూచనలు పాటించాలన్నారు. యూరియా అందుబాటులో ఉందన్నారు. వరి, ఇతర పంటలు వేసిన రైతులందరూ ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ సిబ్బంది రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో పి.మోహనరావు, వ్యవసాయ విస్తరణ అధికారి నారాయణ, సహాయకులు మోహన్, భాస్కర్, అరుణ, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



ఎలమంచిలి: సోమలింగపాలెంలో రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

రాంబిల్లిలో..

మండలంలోని మురకాడ, కట్టుబోలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖరీఫ్ వరినాట్లు వేస్తున్న రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువుల యాజమాన్యం, సూక్ష్మపోషకాల అవశ్యకత, జీవన ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు తెలియజేశారు. వరి సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియా, డీఏపీలను వేయాలన్నారు. ఈ రెండు ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, కనకరత్నం, జ్యోతి, మేఘన, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని నిరసన

రాంబిల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):ఉచిత బస్సు పథకంతో నష్టపోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రాంబిల్లిలో శ్రీవిజయదుర్గ ఆటో కార్మిక సంక్షేమ సంఘం కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఆటో కార్మికులు బేరాలు లేక ఫైనాన్స్‌లు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ25వేలు అందించాలని, రవాణా కార్మికులకు నష్టం చేసే జీవో 21, 31లను రద్దు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు కె.ఫైడిరాజు, నాయకులు వై.చంటి, పి.పెంటయ్య, డి.అప్పారావు, సీహెచ్ లచ్చిబాబు, ఏ.నాయుడు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

ఆటో కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం అచ్యుతాపురంలో ఆటో కార్మికులు భిక్షాటన కార్యక్రమాన్ని చేసి అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో కూండ్రపు సోమినాయుడు, కర్రి నాయుడు, పంచదార్ల ఫైడికొండ, కూండ్రపు వరబాబు, దర్మిరెడ్డి సన్నిబాబు, దుర్గ సంతోష్ పాల్గొన్నారు.



అడ్డరోడ్డు జంక్షనలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

కోటవురట్లలో..

మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా తమకు జీవనోపాధి కోల్పోతున్నామని ఆటోలు డ్రైవర్లు ఆవేదన వ్యక్తంచేశారు. కోటవురట్ల జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు మంగళవారం భిక్షాటన చేసి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకార్యం వల్ల మేమంతా ఆర్థిక ఇబ్బందులు కొట్టుమిట్టుడుతున్నామన్నారు. తమను కూటమి ప్రభుత్వ ఆదుకోవాలని ఆటోడ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్.రాయవరంలో..

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలంటూ మండలంలోని అడ్డరోడ్డులో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అడ్డరోడ్డు జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించి, అనంతరం జంక్షన్‌లో జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఆటో డ్రైవర్లంతా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉపాధి మేట్లతో ఇబ్బందుల్లేవు

▸▸ కూలీల స్పష్టీకరణ

నక్కపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శివారు సారిపల్లివానిపాలెంలో ఉపాధి మేట్లతో తమకు ఎటువంటి ఇబ్బంది లేదని ఉపాధి హామీ పథకం కూలీలు స్పష్టం చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో కొత్తమేట్‌ను నియమించాలంటూ ఆ గ్రామానికి చెందిన ఒకరు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కార్యాలయానికి కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఉపమాక సచివాలయంలో ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఉపాధి హామీ ఏపీడీ, ఇతర అధికారులు విచారణ జరిపారు. ఆ గ్రామ ఉపాధి కూలీలంతా ప్రస్తుతం వున్న మేట్లనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రగడ వీరబాబు, సొసైటీ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, సెక్రటరీ జయప్రకాశ్, టీడీపీ నాయకులు జగదీశ్వరరావు, వాసు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో మెరుగైన ఫలితాలు : డిప్యూటీ డీఈవో

కోటవురట్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని జల్లూరు జడ్పీ హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఇప్పటి నుంచి కార్యాచరణ ప్రణాళిక ద్వారా ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. జిల్లాలో ఈ హైస్కూల్ బెస్ట్ స్కూల్‌గా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ ఏడాది టెన్త్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పరీక్షలు అనే భయం ఉండకూడదని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు శ్రద్ధతో చదవితే మంచి మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈసమావేశంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఇద్దరు బాలురు అదృశ్యం

▸▸ పది గంటల్లో పట్టుకున్న పోలీసులు



తప్పిపోయిన వారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసు

అచ్యుతాపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు బాలురను పది గంటల్లో పట్టుకొన్నట్టు సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నారు. మండలంలోని కొండకర్లకు చెందిన బొద్దపు సందీప్ కుమార్ (14), ఇందల తేజ (14) ఎనిమిదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో ఆగస్టు 31న వీరిద్దరు ఇంటి నుంచి వెళ్లిపోయారు. పిల్లలు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వారి స్నేహితులతో పాటు బంధువుల ఇళ్లకు వెళ్లి వాకబు చేశారు. ఆచూకీ తెలియకపోవటంతో గత నెల 31 రాత్రి ఎనిమిది గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీఐ గణేశ్ ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా, పరవాడ డీఎస్పీ వి విష్ణుస్వరూప్‌లకు తెలియజేశారు. వీరి ఆచూకీ కోసం వెంటనే ఒక టీమ్‌ను సిద్ధం చేశారు. వీరి సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా అనకాపల్లిలో రైలు ఎక్కి శ్రీకాళహస్తి వెళ్తున్నట్టు తెలుసుకున్నారు. వెంటనే గూడూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడ పోలీసులు ఇద్దరు బాలురను పట్టుకున్నారని సీఐ గణేశ్ తెలిపారు. ఫిర్యాదు అందిన పది గంటల్లోనే వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇక్కడ నుంచి తమ సిబ్బందిని గూడూరు పంపి వారిరువురిని అచ్యుతాపురం తీసుకువచ్చి మంగళవారం రాత్రి తలిదండ్రులకు అప్పగించామని సీఐ గణేశ్ తెలిపారు.

దేవవరంలో యూరియా పంపిణీ

నక్కపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం గ్రామంలో రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవర సత్యనారాయణ రైతులకు యూరియా బస్తాలను అందజేశారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో కొరిమి సూర్య గణేశ్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



తుమ్మపాలలో సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందిస్తున్న దృశ్యం

సీఎం సహాయనిధి మంజూరు పత్రాల పంపిణీ

తుమ్మపాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాల గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి చేతుల మీదుగా సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పలు ఆరోగ్య కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏడుగురికి మంజూరైన రూ.2.17 లక్షల మంజూరు పత్రాలను సోమవారం రాత్రి అందించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రతీ ఇంటికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవహరిస్తూ పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు తీయిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



తుమ్మపాల పీఏసీఎస్‌లో స్టాక్ వివరాలను తెలుసుకుంటున్న ఏవో

తుమ్మపాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు అందుబాటులో యూరియాను సిద్ధం చేసినట్టు వ్యవసాయాధికారి పి.రంగాచారి తెలిపారు. మంగళవారం గుండాల జంక్షన్ వద్ద పీఏసీఎస్‌ను ఆయన పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రైతులు నేరుగా వెళ్లి యూరియాను తీసుకోవచ్చునన్నారు. ఇప్పటికే తుమ్మపాల, తగరంపూడి, వెంకుపాలెం, శంకరం, రేబాక, మార్టూరు, అగ్రహారం తదితర గ్రామాల రైతులకు యూరియాను అందించడం జరిగిందన్నారు. అలాగే డీలర్స్ షాపుల వద్ద అక్రమాలు చోటు చేసుకోకుండా గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో అమ్మకాలు సాగిస్తున్నట్టు చెప్పారు. ఎప్పటికప్పుడు డీలర్ల షాపులను తనిఖీ చేస్తున్నామన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలో రైతులందరికీ అవసరమైన యూరియాను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనోత్సవ ఏర్పాట్ల పరిశీలన



శారదా ఘాట్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సందీప్

కొత్తూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శారదానగర్‌ను ఆనుకొని ఉన్న శారదాఘాట్‌ను జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. శారదానది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో భక్తులు నదిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీ అధికారులు క్రేన్‌లు ఏర్పాటుచేసి వినాయకుని పెద్ద విగ్రహాలను నదిలో నిమజ్జనం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. శానిటేషన్ ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పంచాయతీ, జీవీఎంసీ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సుభాష్, శ్రీనివాసరావు, బిల్లు కలెక్టర్ అప్పారావు తదితరులు ఉన్నారు.

శారదానగర్‌లో మలేరియా కేసు నమోదు

పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తం



వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ శారదానగర్ పరిధిలోని ఎనిమిదో వీధిలో మలేరియా కేసు నమోదైంది. ఈ మేరకు మంగళవారం ఏఎన్ఎం రోజువారీ తనిఖీల్లో భాగంగా వైద్య పరీక్షలు చేయగా ఉమామహేశ్వరికి మలేరియా ఉన్నట్టు నిర్ధారణ జరిగింది. దీంతో పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. కార్యదర్శి సుభాష్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బందితో వీధిలో చెత్తచెదారం లేకుండా పరిసరాలన్నీ శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు.

థాంగ్-థా పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పరవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పరవాడ మరిడిమాంబ ఫంక్షన్‌హాల్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి థాంగ్-థా చాంపియన్ షిప్ పోటీల్లో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన 15 మంది బాల భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పది సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల కేటగిరిలో బంగారు, కాంస్య పతకాలు సాధించినట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు షెల్టన్ జేన్స్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ వాసంతిదేవి మంగళవారం అభినందించారు.

యూరియా అధిక ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయండి

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని వ్యవసాయాధికారి డి.అప్పారావు సూచించారు. జి.కోడూరు గ్రామంలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సరిపడా యూరియా ఉందన్నారు. అలాగే ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జి.కోడూరు రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మళ్ల జయబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రూ(టు)పు మారిపోయింది..!

తుమ్మపాల-బవులవాడకు మార్గం పూర్తిగా రూపు మారిపోయింది. రహదారి ఆద్యంతం గతుకుల మయమైంది. ఎక్కడికక్కడ పెచ్చులు ఊడిపోయి అధ్వానంగా తయారైంది. ప్రయాణికులు, వాహన చోదకులను భయపెడుతోంది. ఫలితంగా ఈ రూటులో ప్రయాణం నరకాన్ని తలపిస్తున్నది.

అధ్వానంగా తుమ్మపాల-బవులవాడ రహదారి
రోడ్డు ఆద్యంతం గతుకులు.. ఊడిపోయిన పెచ్చులు
వాహన చోదకులు, ప్రయాణికుల అగచాట్లు
పట్టించుకోని అధికారులు, పాలకులు



పూర్తిగా రూపు కోల్పోయిన తుమ్మపాల-బవులవాడ రహదారి

తుమ్మపాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దశాబ్దం క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో తుమ్మపాల-బవులవాడ రహదారి నిర్మాణం జరిగింది. బవులవాడ నుంచి తుమ్మపాల మీదుగా అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగించేవారు ఈ రోడ్డులోనే అధిక శాతం ప్రయాణిస్తుంటారు. చుట్టూ తిరిగి చోడవరం రోడ్డు నుంచి అనకాపల్లికి చేరుకోవాలంటే దాదాపు ఎనిమిది కిలోమీటర్ల పైబడి దూరం ఉండడంతో, ఎక్కువ మంది ఈ మార్గాన్నే ఆశ్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడికక్కడ తారు లేయరు లేచిపోయి మట్టి రోడ్డును తలపిస్తుంది. అలాగే భారీ గోతులు సైతం ఏర్పడి భయానకంగా దర్శనమిస్తున్నది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పొలాలకు వెళ్లే రైతులు,



పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్న రహదారి



తారు లేయరు లేచిపోయి మట్టి మార్గంలా దర్శనమిస్తున్న రోడ్డు

పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. పలు సందర్భాల్లో ఈ రోడ్డులో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పక్క నుంచి ప్రవహిస్తున్న పంట కాలువలో పడి పలువురు గాయాలపాలైన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇక చీకటి పడిందంటే భయం భయంగానే ఈ రోడ్డులో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డులో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రోడ్డుకు, గోతులకు తేడా తెలియక పలువురు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో ఈ రోడ్డులో ఏర్పడిన గోతుల్లో నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ఈ రహదారి గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రయాణికులు, వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారిని శాశ్వత ప్రాతిపదికన నిర్మాణం చేపట్టి తుమ్మపాల, బవులువాడ గ్రామాల ప్రజలకు ఉపశమనం కల్పించాలని వారు కోరుకుంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..



-తోటాడ విజయ్, ఎంపీటీసీ, బవులవాడ

ఈ రోడ్డు దుస్థితిని ఇప్పటికే ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అవకాశం ఉన్నంత వరకు శాశ్వత ప్రాతిపదికన ఈ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం అధ్వానంగా ఉన్న రహదారిని మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

కశింకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జన్మదిన కేకును కట్ చేశారు. ముందుగా కశింకోట సత్యసాయి సేవాసమితిలో మధ్యాహ్నం అన్నసమారాధన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, బియ్యం పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు అందజేశారు. అనంతరం రాంకీ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల శ్రేయస్సుకు అహర్నిశలు శ్రమిస్తున్న పవన్ కల్యాణ్ ఐదున్నర కోట్ల ఆంధ్రుల జీవితాల్లో వెలుగులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, కూటమి నాయకులు కర్రి సత్యనారాయణ, ఉల్లింగల రమేష్, గల్లా రాజు, కలగ సోమేశ్వరరావు, గోవింద, కర్రి లోవరాజు, అయినాల నాయుడు, దాడి నాగరాజు, అయినాల నాయుడు, దాడి నాగరాజు, దొడ్డి నాగేశ్వరరావు, బలిజ ముసిలినాయుడు పాల్గొన్నారు.





తాళ్లపాలెం కార్యక్రమంలో మాట్లాడుతున్న భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ)... సబ్బవరం అనాథాశ్రమంలో పవన్ పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న నేతలు

నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూకాంబిక అమ్మవారి ఆలయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినం సందర్భంగా జనసేన నాయకులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా హోమాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, మాజీ ధర్మకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు సబ్బవరంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. గొటివాడ జనరేషన్ యువ అనాథాశ్రమ పిల్లలకు ఆహారం అందజేశారు. అనంతరం అక్కడ మొక్కలు నాటారు. స్థానిక దుర్గమాంబ ఆలయంలో పూజలు చేశారు. అమృతపురంలో వెన్నల నరేశ్ సొంత నిధులతో పాఠశాలకు రూ.2.5 లక్షల విలువైన ఆట వస్తువులు అందించారు. మూడు రోడ్ల కూడలిలో పుట్టినరోజు కేక్ కట్‌చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం పవన్‌కళ్యాణ్ నటించిన సినిమాలు ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, మండల కన్వీనర్ కె.కనకరాజు, నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, బి.దేముడుబాబు, బి.అప్పారావు, జి.కుమార్, ఎం.శంకరరావు, బి.పద్మ, పి.మంగరాజు, జి.దుర్గాప్రసాద్, ఝి.పరమటయ్య, ఎస్.రవి, వి.నరేశ్, ఎం.రాజు, జెట్టి లీలాప్రసాద్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివంగత సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళులు



వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అమర్‌నాథ్, హైమావతి తదితరులు

అనకాపల్లి టౌన్/కొత్తూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి వైసీపీ నాయకులు మంగళవారం ఘన నివాళులు అర్పించారు. ముందుగా రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శోభా హైమావతి, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిననాలుగురోడ్ల జంక్షన్‌లోని వైఎస్ విగ్రహానికి కూడా వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అమలులోకి వచ్చిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఆయకులు కేఎం.నాయుడు, జాజుల రమేశ్, వేగి త్రినాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పూడిమడక రోడ్డులో వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి ఓబీసీ జిల్లా చైర్మన్ బొంతు రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు సేనాపతి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు పి.ఆదిమూర్తి, నియోజకవర్గ ఓబీసీ సెల్ చైర్మన్ బుద్ధ మహేశ్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాల మురళీ, పార్టీ నేత మణి తదితరులు పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పరవాడలో నిర్వహించారు. సంతబయలు వద్ద వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బంధం నాగేశ్వరరావు, చుక్క రామునాయుడు, బి.చిన్నారావు, పి.అప్పారావు, బి.కనకారావు, పైలా అప్పలనాయుడు, కె.సీతారామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దివంగత సీఎం రాజశేఖరరెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్థానిక నేతలతో కలసి వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ.. వైఎస్ ఆర్ అమలు చేసిన పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, నేతలు గండి రవికుమార్, కొటాన రాము, బోకం రామునాయుడు, దెడ్డం ప్రసాదరావు, సురేశ్‌రాజ్, బండారు శ్రీను, వడ్డాది అప్పలరాజు, ధనింరెడ్డి శ్రీను, ఐడి బాబు, బలిరెడ్డి కనకరాజు, బీఎం.నాయుడు, హేమంత్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

కశింకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. జనసేన నాయకులు సునీల్, నరసింగరావు, నాయుడు, రమణ వీటిని అందించారు. అలాగే ఎండీఎం కార్మికులకు చీరలు అందజేశారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకుడు మునబర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం అతి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం పంచాయతీ పాలకవర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



కలపాక సమీపంలో బోల్తా పడిన లారీ

పరవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన యాష్ డైక్ నుంచి ఫ్లయాష్ లోడుతో విశాఖకు బయలుదేరిన లారీ మంగళవారం అదుపుతప్పి కలపాక సమీపంలో బోల్తా పడింది. పరిమితికి మించి ఫ్లయాష్‌ను రవాణా చేయడంతో లారీలు బోల్తాపడటం సర్వసాధారణమైపోయింది. దీంతో స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే లారీ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అధిక లోడుతో ఫ్లయాష్ రవాణా చేయడం వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. సింహాద్రి యాజమాన్యం తక్షణమే కలుగజేసుకుని రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం ఏపీఐఐసీ అధికారులు తీసుకున్న భూమికి అదనపు ప్యాకేజీ ఇవ్వాలని పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదు మేరకు తహశీల్దార్ జి.వెంకటరమణ మంగళవారం విచారణ చేపట్టారు. కంపెనీల ఏర్పాటుకు ఏపీఐఐసీ అధికారులు చెట్లను తొలగిస్తున్నారని, రైతుల భూమికి ప్యాకేజీ ఒక్కటే ఇచ్చారని, అదనపు ప్యాకేజీ కింద రూ.50 వేలు ఇవ్వాలని రైతులు కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ పూర్తి విచారణ జరిపి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.



విచారణ చేపడుతున్న తహశీల్దార్ వెంకటరమణ

ఉగ్గినపాలెంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న తహశీల్దార్ తిరుమలరావు తదితరులు

కశింకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.తిరుమలరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావు, మండల సర్వేయర్ రామారావు తదితరులు పదో వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీరు సక్రమంగా అందడం లేదని తెలిపారు. దీంతో అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామంలో ఉన్న మినీ తాగునీటి ప్రాజెక్టు నుంచి నీరు అందించేందుకు ట్యాంకు నిర్మాణానికి కృషి చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో శ్రీనివాసరావు, కూటమి నాయకులు కలగ గోవింద, కలగ శ్రీనివాసరావు, కె.గోవింద పాల్గొన్నారు.

జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణపై సర్వే

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపయ్యపాలెంలో ఉన్న జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణల చేసిన భూమిపై మంగళవారం ఆరుగురు సభ్యులతో సర్వే ప్రారంభించారు. 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రిజర్వాయర్‌లో సుమారు 40 ఎకరాలు ఆక్రమణ గురైందని కలెక్టరు పిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే రిజర్వాయర్ హద్దులను గుర్తిస్తున్నారు. ఆక్రమణదారులు స్వతహాగా వెళ్లకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆశ కార్యకర్తలకు టీఏ, డీఏ ఇవ్వాలి

కశింకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలకు టీఏ, డీఏ తక్షణమే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళశారం యూనియన్ నాయకులతో కశింకోటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాల ఫలితంగా రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.1.5 లక్షలు, ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లు, 180 రోజులు ప్రసూతి సెలవులు తదితర సమస్యలు సాధించుకున్నామన్నారు. ఇంకా సమస్యలు పరిష్కారం చేసుకోవాల్సి ఉందని, అందుకు తగిన విధంగా ఐక్యపోరాటాలు చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఆశ కార్యకర్తలందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆశ కార్యకర్తలు పార్వతి, లక్ష్మి, శ్రీదేవి, వెంకటలక్ష్మి, ఝాన్సీ హైమా తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మురుగుతో ఇక్కట్లు



రహదారిపై నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు

పరవాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సోమునాయుడుపాలెం నుంచి మూలస్వయంభూవరం గ్రామానికి వెళ్లే రహదారి మురుగునీటి ప్రవాహంతో అధ్వానంగా ఉంది. మూలస్వయంభూవరం పూర్తిస్థాయిలో కాలువలు నిర్మించకపోవడంతో వాడుకనీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది కంటిపై కునుకు లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

కొయ్యూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మరిన్ని జన్మదినోత్సవాలు జరుపుకోవాలని జనసేన మండల అధ్యక్షుడు సాగిన బుజ్జిబాబు ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం పవన్ జన్మదినాన్ని జనసైనికులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు సాగిన బుజ్జిబాబు ఇంటి వద్ద నిర్వహించారు. ఇందులో భాగంగా రాజేంద్ర పాలెం, సురేంద్రపాలెం, కొయ్యూరులోర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. మహిళలకు వస్త్ర దానం, పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమాలలో నేతలు గూడెం లక్ష్మణ్, సాగిన బుజ్జిబాబు, శేషుబాబు, సిద్ధు, రాజేశ్, పవన్, సాయి, సునీల్, రవి, సెగ్గే భావన పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరు: సీలేరులో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని నాయకులు వనముల రాము, బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక దుర్గాదేవి సెంటర్‌లో కేక్‌ను కట్ చేశారు.కూటమి నాయకులు చిటికెల రాము, మింది, భాస్కర్, బొర్రా కృష్ణ, కాశీ, అప్పలరాజు, మారిబాబు, జనసేన వీర మహిళలు, జనసైనికులు వీవీ రమణ, అజయ్, తరుణ్, శ్యామలరావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో జనసేన అరకు పార్లమెంట్ కార్యవర్గ సభ్యుడు గొర్లె వీర వెంకట్, మండలాధ్యక్షుడు కొయ్యం బాలు ఆధ్వర్యంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఎహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కొండలరావు, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి నాగమణి, రీమల రాజేశ్వరి, బీజేపీ అధ్యక్షుడు కాకూరి శేఖర్, జనసేన నాయకులు సిద్ధు మార్క్, పాల్గొన్నారు.



సీలేరులో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

జి.మాడుగుల : జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఎం. భీమన్న ఆధ్వర్యంలో పార్టీ కార్యాయలంలో నేతలు కలిసి కేక్‌ను కట్ చేశారు.నాయకులు ఎం.సింహాచలం, టి. వెంకటరమణ, గొంది మురళి, రమేశ్, భానుప్రకాశ్, పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. జన సైనికులు తొలుత బైక్ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద సుమారు 5 కేజీల కేక్ కట్ చేశారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలను అందించారు. విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు.



ముంచంగిపుట్టులో స్వీట్ పంచుతున్న జనసేన నాయకులు

జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు కె.చందు, ఎం.సూర్యనారాయణ, నాయకులు జి.సతీశ్‌కుమార్, పి.మురళి, కార్యదర్శి కె.హరిబందు, నేతలు జి.జవహర్, వడివేలు రవి, భరత్ కుమార్, కార్యకర్తలు, అభిమానులు తదితరలు పాల్గొన్నారు.

హుకుంపేట: పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన నేత నైని సత్తిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు నిర్వహించారు. పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలు అందించారు. ఎంపీటీసీ సభ్యులు రజిని, కో - ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సరస్వతి, రామకృష్ణ, లింగన్న, మహేశ్, మోహన్ పాల్గొన్నారు.



హుకుంపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కొయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నాయకులు

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న పవన్ కల్యాణ్ జనసేన నేతలు, అభిమానులు

చింతపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం ఉప ముఖ్యమంత్రి ఎవన్ కల్యాణ్ జన్మదినం పురస్కరించుకుని స్థానిక ఆర్అండ్‌బీ మైదానంలో జనసేన నాయకులు విశాఖపట్నం ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ సొసైటీ ప్రతినిధులతో కలిసి ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండలానికి చెందిన 55మంది పవన్ కల్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు, యువత రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి యువకుడికి రూ.రెండు లక్షల ప్రమాద బీమాను జనసేన నాయకులు కల్పించారు. జనసేన పట్టణం నాయకులు సుర్ల వీరేంద్ర, గాజుల శ్రీనువాసు, గెడ్డం నాని, మాసాడ రాము, పెదపూడి మధు, తరుణ్, ఎస్కే ఇస్మాయేలు పాల్గొన్నారు.

రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

జి.మాడుగుల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంజరి పంచాయతీ పద్మాపురం, గాలిపాడు గ్రామాలకు రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని గిరిజన ఐక్యవేదిక సహాయ కార్యదర్శి కొండపల్లి మత్యరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ జి.రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ గ్రామాల లబ్ధిదారులు మూడు కిలో మీటర్ల దూరం రేషన్ సరకులు కోసం వెళాల్సి వస్తోందని తహసీల్దార్‌కు వివరించారు. అలాగే భర్త మరణించిన అనంతరం భార్యలకు కల్పించాల్సిన పెన్షన్‌లు పలు చోట్ల నిలిపి వేశారని, వాటి మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.వెంకటరమణ, బి.బంగార్రాజు, కె.ప్రవీణ్‌సాయి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో గోతులు పూడ్చివేత



అనంతగిరి పోలీస్‌స్టేషన్ వద్ద గుంతలను పూడ్చుతున్న దృశ్యం

అనంతగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపట్నంనుంచి అనంతగిరి వరకు ప్రధాన రహదారిలో గోతులను పూడ్చుతూ మరమ్మతుపనులు చేపడుతున్నారు. కాశీపట్నం, డముకు, అనంతగిరి, ఘాట్‌రోడ్డులో పలుచోట్ల పడిన గోతులతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు శని, ఆదివారాల్లో పర్యాటకులు మూడు వారాలు క్రితం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే డముకు వద్ద ఉన్న గోతులతో ఘాట్ రహదారిలో ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. దీంతో జాతీయ రహదారులు సంస్థ అధికారులు గుంతలను మూసివేసేందుకు చర్యలు చేపట్టారు. గత నాలుగురోజులుగా కాశీపట్నంనుంచి అనంతగిరి వరకు ఉన్న గోతుల పూడ్చివేత పనులను చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ సంక్షేమమే ధ్యేయం



సభ్యత్వం అందిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావు

పాడేరురూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ సభ్యులను ఆదుకునేందుకు రాష్ట్ర స్థాయి అసోసియేషన్ పలు సంక్షేమ పథకాలను అమలు చేయనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా గౌరవాధ్యక్షుడు కొట్టగుల్లి రామారావు తెలిపారు. స్థానిక మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సంఘ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కార్మికుడు జిల్లా యూనియన్ సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. సభ్యత్వం పొందిన కార్మికుడు ప్రమాదానికి గురైనా, సహజ మరణం పొందినా వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు రాష్ట్ర సంఘం కార్యాచరణను రూపొందించిందన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, కోశాధికారి మఠం స్వామినాయుడు, పాడేరు అధ్యక్షుడు పొట్నూరి బబ్లూ, ఉపాధ్యక్షుడు సరమండ వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు బంగురు ప్రకాశరావు, లకే గిరిపాత్రుడు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

» అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న సహాయ కలెక్టర్ సాహిత్

పాడేరురూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని సహాయ కలెక్టర్ సాహిత్ సూచించారు. ఆశా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ముందుగా ఆస్పత్రి నిర్వాహణను పరిశీలించారు. అనంతరం ఆశా డే సమావేశంలో పాల్గొన్నారు.ఈ కార్యకర్తలకు పలుసూచనలందించారు. ఆశాల జాబ్‌చార్ట్, రిపోర్టింగ్, రిఫరెల్ సర్వీసెస్, , ప్రసవానంతర కేసుల సేవలు, పీహెచ్‌సీలో కార్యకలాపాలు, మందుల రికార్డులు, వ్యాక్సినేషన్, ఆస్పత్రుల్లో ప్రసవాలు, రిఫరల్ కేసుల వివరాలు, అంబులెన్స్ నిర్వాహణ, సికిల్ సెల్ ఎనీమియా, టీబీ, ఎయిడ్స్ కేసుల తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రోగులకు సకాలంలో అందించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరనాయుడు, పీహెచ్‌సీ వైద్యులు సాయిశ్రీ, అఖిల్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఐదేళ్ల వార్షిక ప్రణాళిక

» ప్రత్యేక అధికారి డాక్టర్ జయరామ్



గిరిజనులతో మాట్లాడుతున్న డాక్టర్ జయరామ్

చింత పల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో డీఏ జుగా (ప్రధాన మంత్రి దర్తి అబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభి యాన్)లో గుర్తించిన గ్రామాల అభివృద్ధికి ఐదేళ్ల వార్షిక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జయరామ్ అన్నారు. మంగళవారం తొలుత మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పీఎం జుగకు ఎంపికైన చౌడుపల్లి పంచాయతీ బయలుకించంగి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఈనెల 12 తేదీ వరకు ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా డీఏ జుగకు ఎంపికైన గ్రామాల్లో మండల స్థాయి అధికారులు పర్యటించి గిరిజన గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తారన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబాల ఎంపికను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, తహసీల్దార్ జి. ఆనందరావు, ఎంఈవో వీబీవీవీ ప్రసాద్, పీఆర్ ఏఈ బాలకిశోర్, సీడీపీవో శ్రీదేవి, ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి, హౌసిగ్ ఏఈ రమణబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ స్వర్ణలత పాల్గొన్నారు.

యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు: సీఐ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌కుమార్

చింతపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్‌బాబు హెచ్చరించారు. మంగళవారం విజిలెన్సు, వ్యవసాయ అధికారులతో కలిసి సీఐ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణ యజమానులు ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే సహించేదిలేదన్నారు. రైతులకు ఎరువులను యజమానులు నిర్ణీత ధరకు విక్రయించాలన్నారు. ప్రభుత్వం యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఎరువుల దుకాణాలకు ప్రభుత్వ అనుమతులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్సు ఎస్సై రవికుమార్, వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు, కానిస్టేబుల్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆశ కార్యకర్తల ర్యాలీ

చింతపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సునీత అన్నారు. మంగళవారం లంబసింగి, తాజంగి పీహెచ్‌సీల్లో గర్భిణులు, బాలింతల ఆరోగ్య జాగ్రత్తలపె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ మహిళ గర్భం ధరించిన నాటి నుంచి తొమ్మిది నెలల కాలంలో వైద్యులతో తనిఖీలు చేయించుకోవాలన్నారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. వైద్యులు సూచనలతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు కచ్చితంగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలన్నారు. శిశువులకు క్రమంగా టీకాలు వేయించాలన్నారు. బాలింతలు సైతం ఏడాది వరకు ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం ఆశ కార్యకర్తలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు జి. భవాని, బి. దినేశ్ కుమార్, వాసవ్య మహిళ మండలి ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

స్పీకర్, మంత్రులను కలిసిన ఎస్టీ కమిషన్ సభ్యుడు



స్పీకర్‌ను కలిసిన ఎస్టీ కమిషన్ సభ్యుడు సాయిరాం

అరకులోయ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన మండలంలోని పద్మాపురం పంచాయతీ ఎండపల్లివలసకు చెందిన కిల్లో సాయిరాం సీకర్ అయ్యన్నపాత్రుడు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణిలను ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌లతోపాటు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకుని ఉన్న తనను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఎస్టీకమిషన్ సభ్యుడిగానియమించినందుకుకృతజ్ఞతలు తెలిపారు.

'కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి'



విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ వరహాలమ్మ

పెదబయలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని స్థానిక ఎంపీపీ బొండా వరహాలమ్మ అన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద సీతగుంట సచివాలయ పరిధిలోని రైతులకు 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను ఎంపీడీవో పూర్ణయ్యతో కలసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజుబాబు, సీతగుంట సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు కిముంకరి బొంజుబాబు, ఉప సర్పంచ్ గంగాధరం, గలగండ సర్పంచ్ లోహిదాసు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

» వర్ధంతి సభలో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



ముంచంగిపుట్టులో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

ముంచంగిపుట్టు దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం వైసీపీ పార్టీ శ్రేణులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి ఆవరణలో గల వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు.సీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టెలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైసీపీ నేతల పి.పద్మారావు, ఎ. జగబంధు, వి.రమేశ్, బాబూరావు, ఎం.సుబ్బలక్ష్మి, జేవీవీఎస్.మూర్తి, జయదేవ్, ఎస్.శంకర్‌రావు, సన్యాసిరావు, ఎస్.తిరుపతి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: వైఎస్ఆర్ 15 వ వర్ధంతిని మంగళవారం నల్లగొండ గ్రామంలో ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు ఆధ్వర్యంలో వైసీపీ మండల అధ్యక్షుడు బిడజాన అప్పారావు, మహిళా నేత రాజులమ్మ సమక్షంలో రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, స్థానిక సర్పంచ్ రాజకుమారి, అచ్యుత్, నేతలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పల్గొన్నారు.

హుకుంపేట: మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని అరకు ఎంపీ తనూజారాణి తెలిపారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక రాజశేఖర్ రెడ్డి విగ్రహనికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాజశేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గుణ,ఎంపీపీ కూడా రాజుబాబు, వైస్ ఎంపీపీ సుశీల, వైసీపీ మండల అధ్యక్షుడు అనిల్ సర్పంచ్ పూర్ణిమ, నేతలు రవిప్రసాద్, సత్యం, కొండబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్న పడాల్, నాయకులు లకే వెంకట రమణ, సాగిన కృష్ణపడాల్, గెమ్మెలి రాచంద్రరావు, గోపీనాథ్, మోహన్‌రావు, బాబూరావు, రీమల సన్యాసిరావు పాల్గొన్నారు.

అరకులోని టీడీపీ కమిటీల పనితీరుపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, పక్కన మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, ఎమ్మెల్యేలు

విశాఖపట్నం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంట్ పరిధిలో కమిటీల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై విశాఖ టీడీపీ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మహిళా శిశు సంక్షేమశాఖ , గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ అరకువ్యాలీ ఇన్‌చార్జి సియ్యారి దొన్ను దొర, రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీషదేవి, పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వర్, పాలకొండ నియోజకవర్గం ఇన్‌చార్జి పడాల భూదేవి పాల్గొన్నారు. స్థానికులకు మరింత మేలు చేసే విధంగా పార్టీకోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తూ పదవుల్లో నియామకాలు జరగాలని సమావేశంలో నిర్ణయించారు. పార్లమెంట్ కమిటీ పనితీరు మరింత సమర్థంగా పని చేసే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు.

స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులకు ఐదు పాఠశాలలు ఎంపిక



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు తదితరులు

పాడేరురూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులకు ఐదు పాఠశాలలు ఎంపిక చేసినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వండలం కొండబాబు తెలిపారు. మంగళవారం పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో క్రీడాకారులు నేషనల్, స్టేట్ క్రీడల్లో పాల్గొన్న ఐదు పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో అరకువేలి ఏపీటీడబ్ల్యూఆర్ స్పోర్ట్స్ స్కూల్, తలారిసింగి జీటీడబ్ల్యూ బాలుర స్కూల్, గుత్తులపుట్టు జీటీడబ్ల్యూ బాలికల స్కూల్, కిల్లోగూడ జీటీడబ్ల్యూ బాలికల స్కూల్, డుంబ్రిగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఉన్నాయి. క్రీడా రంగంలో పాఠశాలలకు అవార్డులు రావడంలో కృషి చేస్తున్నపీఈటీ, ఎస్ఏలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులను డీఈవో పి.బ్రహ్మాజీరావు ఈ సందర్భంగా సన్మానించారు. క్రీడా ప్రతిభ అవార్డులందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో జగన్మోహన్‌రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ నాగేశ్వరరావు, తమోరిజాన్, ఎంఈవో విశ్వప్రసాద్, స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి సింహాచలం, పి.సూరిబాబు, పి.సింహాచలం, కమల్, మన్మధరావు, వి.ఈశ్వరమ్మ, సూరిబాబు, శ్రీను పాల్గొన్నారు.

గోమంగిని మండలంగా ప్రకటించాలి



మంత్రి సంధ్యారాణి, టీడీపీ నేతలకు వినతిపత్రమిస్తున్న మండల సాధన సమితి ప్రతినిధులు

పాడేరురూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెదబయలు మండలంలోని గోమంగి పంచాయతీని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ గోమంగి ప్రత్యేక మండల సాధన కమిటీ ప్రతినిధులు మంగళవారం విశాఖలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అరకు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, అరకు ఇన్‌చార్జి, ఆర్టీసీ విజయనగరంజోన్ చైర్మన్ సియారి దొన్ను దొరలను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కొమ్మ పృథ్వీరాజు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా గోమంగిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పోరాడుతూ వస్తున్నామన్నారు. ప్రభుత్వం కొత్త మండలాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో 17 పంచాయతీల ప్రజలకు కేంద్ర బిందువుగా ఉన్న గోమంగిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, సోమవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు మంత్రులను కలిసి వినతిపత్రమిచ్చామన్నారు. మండల సాధన సమితి సభ్యులు కూడా బొంజుబాబు, జర్సింగి సూర్యనారాయణ, కొమ్మా అనంత పద్మనాభం, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో రాజ్‌మా విత్తనాలు



రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు

గూడెంకొత్తవీధి సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొలిసారిగా నాట్లకు ముందుగానే రాజ్‌మా విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వ్యవశాయ శాఖ అధికారులు గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో సెప్టెంబరు ఆఖరిలో రాజ్‌మా విత్తనాలు వచ్చేవని అన్నారు. ఏవో డి. గిరిబాబు, సర్పంచ్ సుభద్ర, జడ్పీటీసీ సభ్యురాలు గంటా నళిని, ఎంపీటీసీ సభ్యురా లు నాగమణి, రాజేశ్వరి, కూటమి నాయకుడు ముక్కలి కల్యాణి, శేఖర్ పాల్గొన్నారు.

హుకుంపేట: రాజ్‌మా విత్తనాల పంపిణీని ఎంపీపీ రాజుబాబు మంగళవారం దాలిగుమడి రైతు భరోసా కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రమ, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: స్థానిక రైతు భరోసా కేంద్రం వద్ద ఏవో రంగరావు ఆధ్వర్యంలోని అనంతగిరి, ఎగువశోభ పంచాయతీల గిరిజనులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ దీసరి గంగరాజు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు రూతు, సింహాద్రి, టీడీపీ మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, జనసేన అధ్యక్షుడు మురళి, శ్యామ్, అగ్రికల్చర్ సిబ్బంది కుమారి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధినేత జన్మదిన వేడుకలు

డుంబ్రిగుడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ జన్మదిన వేడుకలను జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సీదరి దనేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కించుమండలో సమావేశమై కేకును కట్ చేసి పంచిపెట్టారు. జనసేనఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శులు రాందాస్, లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, నేతలు సహదేవ్ రఘునాథ్, మత్యాల్‌నాయుడు, బాబూరావు, హరి, అచ్చిబాబు, దిలీప్, శేఖర్, బంటు, మోహన్, చార్లెస్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా రోగులకు దుప్పట్లు పంపిణీ



వృద్ధులు, సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లుంగపర్తి గ్రామంలోని పీహెచ్‌సీ వద్ద విజయనగరం ఏబీసీడీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులను మంగళవారం పంపిణీ చేశారు. వైద్యాధికారి మంజు భార్గవి, పీహెచ్ఎన్ పి. వెంకటలక్ష్మి, ఎంపీహెచ్ఈవో రాజారావు, సంస్థ అధ్యక్షుడు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఈ నెల ఏడో తేదీ వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 3.5 మిల్లీమీటర్లు, గరిష్ఠంగా 22.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదువుతుందన్నారు. గాలిలో తేమ 82-92 శాతం ఉంటుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాత్రుడు

ప్రతీ వారం సమస్యలపై ప్రజాదర్బార్

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు పాత్రుడు

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రతీ వారం సమస్యలపై ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులకు దరఖాస్తు చేసినా పని జరగకపోతే ప్రజాదర్బార్‌లో తెలియజేయాలన్నారు. అంతేగాని ఇష్టారాజ్యంగా ఫిర్యాదులు ఇస్తే బాగుండదన్నారు. అలాగే ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు తీసుకుంటే తెలియజేయాలన్నారు. రెవెన్యూ సమస్యలపై నారాయణరాజుపేట, బూరుగుపాలెం గ్రామాలకు చెందిన నాయకులు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అలాగే గ్రామాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాలు, రీ సర్వేపై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీటిపై దృష్టిసారించి పూర్తిచేస్తామన్నారు. సమావేశంలో తామరం పీఏసీఎస్ అధ్యక్షుడు శీరంరెడ్డి చిన బాబు, ఏఎంసీ డైరెక్టర్ రమణ, టీడీపీ నేత అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం జయప్రదం చేయాలి

గొలుగొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ఈ నెల 4న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తారకవేణుగోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని జోగంపేట గ్రామంలో మంగళవారం మాట్లాడుతూ కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఏరియా ఆస్పత్రిలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ప్రతీ గ్రామం నుంచి సుమారు 20 మంది కార్యకర్తలు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చిటికెల సాంబమూర్తి, ఎ.అప్పలనాయుడు, సుర్ల బాబ్జి, కొల్లి రాంబాబు, బీమిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

జనసేన నాయకుల సేవా కార్యక్రమాలు



రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాన్ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ సీనియర్ నేత దొరబాబు ఆధ్వర్యంలో ముందుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో గర్భిణులు, రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పవన్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అద్దెపల్లి గణేశ్, సహదేవుడు, కర్రి సంతోశ్, ఎం.రాజు, గొంప కృష్ణ పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, నాగాపురం, రామచంద్రపురం, లింగంపేట గ్రామాల్లో నాయకులు, అభిమానులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు లంక సత్యనారాయణ, దుంపలపూడి సహదేముడు, అనిశెట్టి గోపి, ఈర్ని చిన్ని, శివాజీ, ప్రసాద్, రమేష్ తదితర నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలపై సర్వే

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపయ్యపాలెంలో ఉన్న జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణల చేసిన భూమిపై మంగళవారం ఆరుగురు సభ్యులతో సర్వే ప్రారంభించారు. 90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రిజర్వాయర్‌లో సుమారు 40 ఎకరాలు ఆక్రమణ గురైందని పాపయ్యపాలెం చైర్మన్ కిల్లాడ రామారావు, సంఘం డైరెక్టర్లు ఇటీవల జిల్లా కలెక్టరు పిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే ప్రారంభించి ముందుగా రిజర్వాయర్ హద్దులను గుర్తిస్తున్నారు. పూర్తి స్థాయి సర్వే చేసి తగిన చర్యలు తీసుకుంటామని సర్వే బృందం సభ్యులు తెలిపారు. ఆక్రమణదారులు స్వతహాగా వెళ్లిపోవాలని వారు సూచించారు. లేనిపక్షంలో క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



పాపయ్యపాలెం రిజర్వాయర్‌లో సర్వే చేస్తున్న సభ్యులు

గణపతిని దర్శించుకున్న స్పీకర్ దంపతులు



లడ్డూ ప్రసాదాన్ని స్పర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు

నర్సీపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అబీద్ సెంటర్ అయ్యరక వీధిలో నూకాంబికా యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 22 అడుగుల మట్టి గణపయ్యను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహలను అభినందించారు. ఈ నెల 6న ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణకు హాజరై స్వామివారి ప్రసాదం స్వీకరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేశ్, నాయకులు పెదిరెడ్ల జోగారావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయించొద్దు

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరలకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని వ్యవసాయాధికారి డి.అప్పారావు సూచించారు. జి.కోడూరు గ్రామంలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో సరిపడా యూరియా ఉందన్నారు. అలాగే ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జి.కోడూరు రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత మళ్ల జయబాబు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ



విచారణ చేపడుతున్న తహశీల్దార్

మాకవరపాలెం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం ఏపీఐఐసీ అధికారులు తీసుకున్న భూమికి అదనపు ప్యాకేజీ ఇవ్వాలని పీజీఆర్ఎస్‌లో అందిన పిర్యాదు మేరకు తహశీల్దార్ జి.వెంకటరమణ మంగళవారం విచారణ చేపట్టారు. కంపెనీల ఏర్పాటుకు ఏపీఐఐసీ అధికారులు చెట్లను తొలగిస్తున్నారని, రైతుల భూమికి ప్యాకేజీ ఒక్కటే ఇచ్చారని, అదనపు ప్యాకేజీ కింద రూ.50 వేలు ఇవ్వాలని రైతులు కోరారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ పూర్తి విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

నాతవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన జనసేన నూతన కార్యాలయాన్ని పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర మంగళవారం కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు నాతవరం మెయిన్ రోడ్డులో మూడు మండలాల నాయకులు, మహిళలు కోలాటాలు ఆడుతూ పార్టీ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు. అనంతరం 250 మంది మహిళలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర తదితరులు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరో 15ఏళ్ళు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు జనసేన నాయకులు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టుకమిటి చైర్మన్ కరక సత్యనారాయణ మాజీ ఎంపీపీ ఎస్ విజయ్‌కుమార్ , మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ పోలుపర్తి శ్రీనివాసరావు, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు జిల్లా ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి పంచాడ హరినాథ్ సలాదుల ప్రసాద్ మీసాల

గ్రామాల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

నర్సీపట్నం/నాతవరం/గొలుగొండ/కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాలలో వైసీపీ నాయకులు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహానికి పూలమాలలవు వేసి ఘనంగా నివాళులర్పించారు. నర్సీపట్నం కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సన్యాసిపాత్రుడు, నాయకులు శివప్రసాద్ పాల్గొన్నారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న వైఎస్ విగ్రహానికి పూలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంగిన రమణ, సిద్ద పాల్గొన్నారు. గొలుగొండ మండలంలోని జరిగిన కార్యక్రమంలో లోచల సుజాత, గజ్జలపు మణికుమారి, బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, పి.సత్యంనాయుడు, రఘురామ్, లోచల సుజాత, తోకల సంతోశ్, బి.రాజు, కె.పాణిశాంతారాం, ఎల్.అప్పనాయుడు, సత్యనారాయణ, కసిపల్లి బుజ్జి, మాకిరెడ్డి రామకృష్ణ, పాల్గొన్నారు. నాతవరం మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైసీపీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, రాష్ట్ర పామ్‌ఆయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, నర్సీపట్నం నియోజకవర్గ వైసీపీ ఎస్టీసెల్ అధ్యక్షుడు బండి గంగరాజు, జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణీ గన్నవరం పీఏసీఎస్ మాజీ చైర్మన్ గొర్లి వరహాలబాబు తదితరులు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవు వేసి నివాళులర్పించారు.

పీఎస్‌పేటలో గణపతికి లక్ష గరిక పూజ

చోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎస్‌పేట లక్ష్మీగణపతి ఆలయంలో వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా మంగళవారం సరస్వతీ పూజతోపాటు, లక్ష గరిక పూజ నిర్వహించారు. ఆలయంలో చైర్మన్ పుప్రీవు శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు సూర్యగోపాలాచార్యులు, గోవిందాచార్యులు, నరసింహాచార్యులు హనుమాన్ మన్యుసూక్త హోమం, లక్ష గరిక పూజల అనంతరం సరస్వతీదేవి పూజ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పూజలో ఉంచిన పుస్తకాలు, పెన్నులను అందచేశారు. ఈ కార్యక్రమంలో భారీగా భక్తులు పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటుతో యువకుడి మృతి

బుచ్చెయ్యపేట, సెపెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన సయ్యపురెడ్డి రాజేశ్ అనే యువకుడు మంగళవారం కొత్తవలసకు బస్సులో వెళుతుండగా గుండెపోటుతో మృతి చెందాడు. వడ్డాది నుంచి కొత్తవలసకు బస్సులో వెళుతుండగా పెందుర్తి దగ్గరకు వెళ్లేసరికి గుండెపోటుతో కుప్పకూలాడు. ఆ విషయాన్ని గమనించిన బస్సు సిబ్బంది పెందుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే రాజేశ్ మృతి చెందినట్టు నిర్ధారించారు. రాజేష్‌కి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు. యువకుడి అకాల మరణంతో వడ్డాది గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు చోడవరంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం

రావికమతం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 18 ఏళ్ల లోపు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీకి గుర్తింపు, వైద్య నిర్ధారణ శిబిరాలను ఈనెల 3న చోడవరం బాలికల జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసినట్టు రావికమతం భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథనాయుడు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, అల్మికో సంస్థ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈనెల మూడున ఉదయం తొమ్మిది గంటల నుంచి నిర్వహించే శిబిరంలో రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, చోడవరం మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో చదివే దివ్యాంగ విద్యార్థులు పాల్గొనాలన్నారు. దివ్యాంగ విద్యార్థులకు మోటారైజ్డ్ బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ చైర్లు, సీపీ చైర్లు, రోలేటర్స్ వాకర్స్ వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్స్ ఎంఆర్ కిట్‌లు ఉచితంగా ఇచ్చేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారన్నారు. దివ్యాంగ విద్యార్థులు యూడీఐడీ కార్డ్, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డులతో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకు రావాలని ఆయన తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన విస్తరణ అధికారి

దేవరాపల్లి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ మంగళవారం తనిఖీ చేశారు. వర్షాలు పడుతున్న కారణంగా ఆస్పత్రిలో నమోదవుతున్న కేసులు, మందుల నిల్వలు వంటి వివరాలను వైద్యాధికారి పూజిత మేఘనను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది, స్టాఫ్ నర్సుల వివరాలను అడిగితెలుసుకున్నారు. మరో వైద్యాధికారి వనజ, కో-ఆర్డినేటర్ వీపీవీత్రినాథ్ పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతపూడి కేజీబీవీలో గణిత ఉపాధ్యాయ పోస్టుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి సీహెచ్ భువన మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు 60 గంటలు పని చేయవలసి ఉంటుందని, రూ.12 వేలు వేతనం ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కేజీబీవీకి రావాలని ఆమె కోరారు.

కొండబాబుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న కొండబాబు

దేవరాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో పేదలకు చేస్తున్న సేవలకు మండలంలోని వేచలం గ్రామానికి చెందిన మీసాల కొండబాబుకు శంకర్ ఫౌండేషన్ ఉత్తమ అవార్డును అందజేసింది. మంగళవారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో కొండబాబుకు శంకర్ ఫౌండేషన్ ట్రస్టు ఏ.కృష్ణకుమార్, హాస్పటల్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్ ఈ అవార్డును అందజేశారు. కొండబాబును అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, సత్యనారాయణ, తదితరులు అభినందించారు.

గ్యాస్ సరఫరా చేయాలని ఆదివాసీలు ధర్నా

రావికమతం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్లున్న గిరిజన గ్రామాలకు గ్యాస్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీలు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ.. టి. అర్జాపురం పంచాయతీ శివారు పి.కొట్నాబిల్లి, కె.కొట్నాబిల్లి, రామన్నదొరపాలెం, గదభపాలెం గ్రామాల గ్యాస్ లబ్ధిదారులు సిలిండర్ల కోసం గొడౌన్‌కు వచ్చి తీసుకెళ్లాల్సి వస్తున్నారు. లబ్ధిదారుల ఇళ్లకు గ్యాస్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్జాపురం వరకు గ్యాస్ ఏజెన్సీ వారే గ్యాస్ సరఫరా చేస్తున్నారని, తర్వాత రోడ్డు ఉన్న గిరిజన గ్రామాలకు గ్యాస్ సరఫరా చేయకపోవడం అన్యాయమన్నారు. అనంతరం తహశీల్దార్ అంబేడ్కర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

విజయరామరాజుపేట వద్ద వంతెన నిర్మించాలని వైసీపీ ఆందోళన

బుచ్చెయ్యపేట, సెపెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో విజయరామరాజుపేట తాచేరు నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వైసీపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు మాట్లాడుతూ భారీ వర్షాలకు కాజ్‌వే కొట్టుకుపోయి 16 రోజులు గడిచిన ఎమ్మెల్యే రాజు పట్టించుకోలేదన్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకొని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలిత, కోవెల జనార్దన రావు, జోగా కొండబాబు, ఎంపీటీసీ సభ్యుడు రమణ, సర్పంచ్ విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో కుంగిన కల్వర్టు

▸▸ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన పోలీసులు

రావికమతం,సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రోడ్డులోని కొత్తకోట ఒక ప్రైవేటు స్కూల్ సమీపంలో కుంగిన కల్వర్టును మంగళవారం కొత్తకోట ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకలతో కల్వర్టు కొంత మేర కుంగిపోయింది. దీనికి తోడు అక్కడ తుప్పలు పెరగడంతో గొయ్యి ఆనవాళ్ల కనించక రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. అయినా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో స్పందించిన కొత్తకోట ఎస్‌ఐ ఎం. శ్రీనివాస్ కుంగిన కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

ఫ్లోరైడ్ బాధితుల గుర్తింపునకు వైద్యశిబిరం

రోలుగుంట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరులో రోలుగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్లోరైడ్ బాధితుల గుర్తింపునకు మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉందంటూ ఐటీడీపీ ఇన్‌చార్జి బంటు రాజు ఇటీవల డీఎంహెచ్‌వో హైమావతికి ఫిర్యాదు చేశారు. దీంతో పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాజిద, శ్రావణిల ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో నీటి సరఫరా అవుతున్న తాగునీటి ట్యాంకులు, బోర్‌వెల్స్, బావులు, పాఠశాలల వద్ద నీటి శాంపిల్స్‌ను సేకరించారు. అలాగే గ్రామంలో 50 కుటుంబాలకు చెందిన 120 మంది వద్ద నుంచి కూడా శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. మరో రెండు రోజులపాటు ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చినగొలుగొండపేట డ్రోన్ ప్రారంభం

నాతవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చినగొలుగొండపేట గ్రామంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ మంగళవారం డ్రోన్ ప్రారంభించారు. మరిడిమహలక్ష్మీ అమ్మవారి గ్రూపు సభ్యులకు రూ.10 లక్షల విలువైన ఈ డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా తాండవ చైర్మన్ మాట్లాడుతూ ఈ డ్రోన్‌కు రూ.2 లక్షల రాయితీని ప్రభుత్వం అందజేస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాధికారి సుగుణ, సిబ్బంది, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

చోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్థానిక స్వయంభూ విఘ్నేశ్వరాలయం వద్ద, ముద్దుర్తిలోని సంగమేశ్వరాలయం వద్ద పవన్ కల్యాణ్ పేరిట పూజలు నిర్వహించారు. అనంతరం గోవాడలో నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్థానికులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అల్లం మాధవి, అప్పారావు, జనసేన నాయకులు సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, కర్రి రమేష్, నరవ సరోజిని, తుమ్మపాల రమేష్ పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగులలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ అభిమానులు, జనసేన నాయకులు కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పారిశుధ్య శ్రామికులకు జనసేన నేతలు కాళ్లు కడిగిన అనంతరం సత్కరించారు. కార్యక్రమంలో అభిమానులు. జనసైనికులు పాల్గొన్నారు.



గోవాడలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు పీవీఎస్ఎన్ రాజు

మాడుగుల రూరల్‌లో..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం జనసైనికులు ఘనంగా నిర్వహించారు. వీరవిల్లి అగ్రహారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక జనసైనికులు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు స్వీట్లు, పుస్తకాలు పెన్నులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కె.రాజా, అశోక్, కృష్ణ, వెంకటప్పారావు, శివ, గిరివాసు, లోవ తదితరులు పాల్గొన్నారు.



వీరవిల్లి అగ్రహారంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జనసైనికులు

రోలుగుంటలో..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు మండలంలోని బుచ్చెంపేట, రోలుగుంటల్లో జన మండల పార్టీ అధ్యక్షులు బలిజి మహారాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రోలుగుంట పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అలాగే బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రంలో జనసేన నాయకులు శనివాడ సోమాలనాయుడు, గాలి బాలరాజుల ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళి

చోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):స్థానిక కొత్తూరు జంక్షన్‌లో మంగళవారం దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసులమ్మ, వైసీపీ నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, డీవీఆర్, సత్య పుల్లేటి వెంకటేశ్, బైన ఈశ్వరరావు, చవితిన బాబూరావు, శరగడం నాగేశ్వరరావు, గోవింద్ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో..

మండలంలో పలు గ్రామాల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వడ్డాది నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ లలిత నారాయణమూర్తి పూలమాల లు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు జి కొండబాబు, కె జనార్దనరావు, ఎంపీటీసీ సభ్యుడు రమ ణ, సర్పంచులు అప్పలరాజు, అమ్మునాయుడుపాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగులలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో వైఎస్ విగ్రహానికి వైసీపీ పట్టణ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ నాయకుడు రామధర్మజ, సర్పంచ్ కళావతి, విజయలక్ష్మి, జవ్వాది వరహాలు పాల్గొన్నారు.



చోడవరంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకల్లో మాజీ మంత్రి అమర్‌నాథ్, నాయకులు

దేవరాపల్లిలో..

మండలంలోని మామిడిపల్లిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల సలహా సంఘం సభ్యులు బూడిముత్యాలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతలబుల్లి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి.సత్యం, వైసీపీ మండల అధ్యక్షుడు బూరే బాబూరావు, కేవీ. రమణ, పంచాడ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎ.కొత్తపల్లిలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి సర్పంచ్ చింతల వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోలుగుంటలో..

మండలంలోని రోలుగుంటలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని వైసీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మామిడిపల్లిలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు,నేతలు

చీడికాడలో..

చీడికాడలో స్వర్గీయ వైఎస్.రాజశేఖరరెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు పూలమాలలు వేసి, అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే తురువోలులో పీటీ.బాబు, అప్పలరాజుపురంలో సర్పంచ్ చుక్క అప్పలనాయుడు, వరహాపురంలో సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్ములు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, యూత్ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు పరవాడ మహేష్ పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం

పారా వాలీబాల్ క్రీడలో రాణిస్తున్న గణేశ్




చైనాలో జరిగిన పారా వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆస్ట్రేలియా జట్టుతో ఆడుతున్న గణేశ్

- ఇంతవరకు ఎనిమిది జాతీయ, 12 రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన దివ్యాంగుడు
- గత ఏడాది ప్రపంచ కప్ పోటీల్లో భారత్‌కు రజత పతకం రావడంలో కీలక భూమిక
- వచ్చే నెల అమెరికాలో జరిగే వరల్డ్ కప్ పోటీలకు భారత్ జట్టులో స్థానం
- హరియాణాలోని హిస్సార్‌లో శిక్షణకు పయనం
- 2028 పారా ఒలింపిక్స్‌లో ఆడాలన్నదే లక్ష్యమంటున్న సోముదేవుపల్లి యువకుడు



తల్లిదండ్రులు అర్జునరావు, మణిలతో గణేశ్



పారా వాలీబాల్ ప్రాక్టీస్‌లో అన్నం గణేశ్

ఎస్.రాయవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని సోముదేవుపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేశ్ అనే దివ్యాంగుడు పారా వాలీబాల్ పోటీల్లో సత్తా చాటుతున్నాడు. క్రీడలపై ఆసక్తి వున్న ఇతను తొలుత వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ ఆడడం మొదలుపెట్టాడు. తరువాత వాలీబాల్ అంటే మక్కువ పెంచుకుని క్రమంగా పట్టుసాధించాడు. ఈ ఏడాది అక్టోబరు 12 నుంచి 18వ తేదీ వరకు అమెరికాలో జరగనున్న పారా వాలీబాల్ ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులో స్థానం సంపాదించాడు.

సోముదేవుపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేశ్ పుట్టుకతోనే పోలియో బాధితుడు. తండ్రి అర్జునరావు ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండగా, తల్లి మణి పశువులు మేపుతుంటారు. ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ దివ్యాంగుడైన కుమారుడు గణేశ్‌ను చదువులో ప్రోత్సహించారు. ఇటీవల పీజీ పూర్తి చేశాడు. కాగా గణేశ్‌కు పదేళ్ల వయసులోనే క్రీడలపై మక్కువ ఏర్పడింది. పాఠశాలలో చదువుతున్నప్పుడు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ వంటి క్రీడలు ఆడేవాడు. కొంతకాలం తరువాత వాలీబాల్‌పై ఆసక్తి పెరిగింది. దివ్యాంగుడు కావడంతో పదేళ్ల నుంచి వివిధ స్థాయిలో పారా వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నాడు. 2016 నుంచి ఇప్పటి వరకు ఎనిమిది జాతీయ, 12 రాష్ట్రస్థాయి పారా వాలీబాల్ పోటీల్లో పాల్గొని జట్టుకు పతకాలు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. నక్కపల్లి, ఎలమంచిలి ప్రాంతాల్లో వున్న దివ్యాంగ క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆటలో ప్రాక్టీస్ చేస్తూ నైపుణ్యాన్ని పెంచుకున్నారు. రాష్ట్ర పారా వాలీబాల్ అసోసియేషన్ సహకారంతో పలుచోట్ల శిక్షణ శిబిరాలకు హాజరై మెలకువలు నేర్చుకున్నాడు.



పారా వాలీబాల్ పోటీల్లో వ్యక్తిగత ప్రతిభ చూపి గణేశ్ సాధించిన పతకాలు, కప్పులు

2023లో తమిళనాడు రాష్ట్రం తంజావూరులో జరిగిన 11వ జాతీయ స్థాయి పారా పారా వాలీబాల్ పోటీలు, 2024లో రాజస్థాన్ రాజధాని జైపూర్ జరిగిన 12వ జాతీయ స్థాయి పారా వాలీబాల్ పోటీలు, ఈ ఏడాది బెంగళూరులో జరిగిన 13వ సీనియర్ నేషనల్ సిటీ యూనివర్సిటీ పారా వాలీబాల్ ఛాంపియన్ పోటీల్లో గణేశ్ ఆడాడు. గత ఏడాది చైనాలోని యుగాంగ్‌లో జరిగిన పారా బీచ్ వాలీబాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు తరపున ఆడిన గణేశ్, తోటి ఆటగాళ్లతో కలిసి చక్కని ప్రతిభకనబరిచి రజత పతకం సొంతం చేసుకున్నారు. గణేశ్ వాలీబాల్ పోటీలే కాకుండా అథ్లెటిక్స్ పోటీల్లో జావెలిన్ త్రో, లాంగ్‌జంప్‌లో బంగారు పతకాలు సాధించాడు.

వచ్చే నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అమెరికాలోని ఇండియానా రాష్ట్రం పోర్ట్ వేనేలో జరగనున్న సిట్టింగ్ పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులో స్థానం సంపాదించాడు. హరియాణా రాష్ట్రం హిస్సార్‌లో జరిగి శిక్షణ శిబిరానికి హాజరయ్యేందుకు ఒకటో తేదీన ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లాడు.



గత ఏడాది చైనాలో జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకం సాధించిన భారత్ జట్టుతో గణేశ్

పారా ఒలింపిక్స్‌లో ఆడాలన్నదే లక్ష్యం



వచ్చే నెలలో అమెరికాలో జరిగే పారా వాలీబాల్ ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొనే భారత్ జట్టులో స్థానం లభించడం ఎంతో ఆనందంగా వుంది. 2028లో జరగున్న పారా ఒలింపిక్స్ పోటీల్లో దేశం తరపున ఆడాలన్నదే నా లక్ష్యం. ఆర్థికంగా సహకరించేందుకు స్పాన్సర్లు ముందుకు వచ్చినట్టయితే వాలీబాల్ క్రీడలో మరింత రాణించి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలుస్తాను.

అన్నం గణేశ్,
పారా వాలీబాల్ క్రీడాకారుడు

ఆశ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షురాలు శాంతి, ప్రధాన కార్యదర్శి సత్యవతి, కోశాధికారి పార్వతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) జిల్లా కమిటీని ఇక్కడ ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.శాంతి, ప్రధానకార్యదర్శిగా వి.సత్యవతి, కోశాధికారిగా ఇ.పార్వతి, కార్యదర్శులుగా కె.రామలక్ష్మి, ఎం.సూర్యకళ, ఉపాధ్యక్షులుగా కె.రాజ్యలక్ష్మి, అరుణ, కార్యవర్గసభ్యులుగా ఇందిర, సీహెచ్.వరలక్ష్మి, లక్ష్మీకుమారి, వరలక్ష్మి, నాగమణి, మంగలక్ష్మి, మంగాదేవి, వరలక్ష్మి, మంగవేణి ఎన్నికయ్యారు.

ఏయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ రాంబాబు బాధ్యతల స్వీకారం



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ కె.రాంబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ కె.రాంబాబు మంగళవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు, పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇఎన్ ధనుంజయరావు, పలువురు ప్రిన్సిపాల్స్, డీన్లు, ప్రొఫెసర్లు, ఇతర అధికారులు, ఏయూ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రొఫెసర్ రాంబాబు విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. వర్సిటీ అభివృద్ధికి తన శాయక్తులా కృషిచేస్తానన్నారు.

అనకాపల్లిలో వీధి కుక్కల బెడద

- ఒకే రోజు రెండుచోట్ల మహిళలపై దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు
- స్పందించిన జీవీఎంసీ అధికారులు
- కుక్కలను నిర్బంధించి.. సంతాన నిరోధక శస్త్రచికిత్సలు



కుక్క కాటుకు గురైన శ్రావణజ్యోతి



పట్టణంలోని ఒక వీధిలో కుక్కలను బంధిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారులపై శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేసి కరుస్తున్నాయి. మంగళవారం కోట్నీవీధిలో కోట్నీ శ్రావణజ్యోతిపై కుక్క దాడి ముఖంపై పలుచోట్ల కరిచింది. ఆమెకు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. లక్ష్మీనారాయణనగర్‌లో కూడా ఒక మహిళపై కుక్క దాడి చేసి, చేతిపై కాటు వేసింది. కుక్కల బెడదను నివారించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో 'యానిమల్ బర్త్ కంట్రోల్' కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. పట్టణంలో కుక్కలను పట్టుకుని ఇక్కడ శస్త్రచికిత్స చేసిన దాఖలాలు లేవు. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో కుక్కల దాడిలో గాయపడిన వారిలో జూన్‌లో 246 మంది, జూలైలో 285 మంది, ఆగస్టులో 259 మంది ఎన్టీఆర్ వైద్యాలయంలో యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. కాగా పట్టణంలో కుక్కల బెడదపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవరిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఇటీవల కాలంలో కుక్కలను పట్టుకున్న దాఖలాలు లేవని, అనకాపల్లిలో యాంటీ బర్త్ కంట్రోల్ కేంద్రం ఉన్నప్పటికీ దానిని వినియోగించుకోవడం లేదన్నారు. కోట్నీవీధిలో మహిళపై కుక్క దాడి చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని, కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య విభాగం అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. దీంతో మంగళవారం సాయంత్రం గాజువాక నుంచి వచ్చిన ప్రత్యేక సిబ్బంది.. పట్టణంలో పలుచోట్ల కుక్కలను బంధించి, వాటికి సంతాన నిరోధక ఆపరేషన్లు చేశారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఇప్పటి నుంచి ప్రత్యేక కార్యాచరణ అమలు
- విద్యా శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ యాజమాన్యాల్లోని విద్యా సంస్థల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి విద్యా శాఖ అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల అధికారులతో పలు అంశాలపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏ ఒక్క విద్యార్థి కూడా మధ్యలో చదువు మానేకూడదని, ప్రతి తరగతికి సంబంధించి విద్యార్థి తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని, అందులో విద్యార్థుల గైర్హాజరు, రోజు వారీ అసైన్‌మెంట్, హోం వర్కు వివరాలను పొందుపరచాలన్నారు. వరుసగా మూడు రోజులకు మించి విద్యార్థి హాజరుకాకపోతే వెంటనే తల్లిదండ్రులను సంప్రదించాలని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో డ్రాపౌట్స్ ఎక్కువగా వుంటున్నాయని, ఇందుకుగల కారణాలను తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై సమాచారం వచ్చిన వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వలస కార్మికులు/ కూలీల కుటుంబాలకు చెందిన విద్యార్థులను వసతిగృహాల్లో చేర్చుకోవాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో శక్తి క్లబ్‌ను ఏర్పాటు చేయాలని, వీటిద్వారా బాలల హక్కులు, పోక్సో చట్టం, మంచి-చెడు స్పర్శల తేడాలు, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులను సెల్‌ఫోన్లతో పాఠశాలలు, కళాశాలల్లోకి అనుమతించవద్దని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

జిల్లాలో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్టయితే సంబంధిత పరిధిలోని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, కౌమార దశలో గర్భందాల్చితే తలెత్తే ఆరోగ్య సమ్యలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పౌష్టికాహార లోపం, రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.సూర్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన జిల్లా నేతలు



విశాఖపట్నంలో సీఎం చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు, సుందరపు, కార్పొరేషన్ల చైర్మన్లు మళ్ల సురేంద్ర, బత్తుల తాతయ్యబాబు

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం విశాఖపట్నం పర్యటనకు వచ్చిన సందర్భంగా అనకాపల్లి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేవల్ కోస్టల్ బ్యాటరీలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, తదితరులు గులాబీ పువ్వులను అందించి స్వాగతం పలికారు.

క్రైం... crime news

మెడలో నుంచి పుస్తెలతాడు అపహరణ

చోడవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం రోడ్డులో మోదకొండమ్మ గుడి వద్ద మంగళవారం ఉదయం ఓ భక్తురాలి మెడలోని నాలుగున్నర తులాల పుస్తెల తాడును ఆగంతుకుడు గుంజుకుని ఉడాయించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. లక్ష్మీపురం రోడ్డులో నివాసముంటున్న నల్లా అరుణ మంగళవారం రహదారి పక్కనే ఉన్న మోదకొండమ్మ పాదాల వద్దకు వచ్చింది. పూజ చేస్తున్న సమీపంలో అక్కడే పొంచి ఉన్న ఆగంతుకుడు ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును తెంచుకుని పారిపోయాడు. ఆమె కేకలు విని అక్కడకు చేరుకున్న స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వచ్చి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. ఆగంతుకుడు ముఖం కనిపించకుండా రుమాలు కప్పుకున్నట్టు బాధితురాలు తెలిపింది. అనకాపల్లి నుంచి క్రైం పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

ఆరున్నర కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు

నర్సీపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీసులు ఆరున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ ఉమా మహేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు మంగళవారం నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఔట్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఎలమంచిలి వివేక్, కాకినాడకు చెందిన ఉయ్యాల సాయి చరణ్‌లను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 6.47 కిలోల గంజాయి ఉండడంతో దానిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీరికి గంజాయి విక్రయించి తుని వరకు పైలట్‌గా వెళ్లడానికి ఒప్పుకున్న హుకుంపేటకు చెందిన బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

మద్యం సేవించిన స్కూల్ బస్సు నడిపిన డ్రైవర్ అరెస్టు

పరవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం సేవించి, ఓ ప్రైవేటు స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళుతున్న బస్సు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామానికి చెందిన మాసవరపు రాజు స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్‌లో వున్న ఒక ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని స్కూల్‌కు వెళుతున్నాడు. అయితే డ్రైవర్ రాజు మద్యం సేవించి బస్సు నడుపుతున్నట్లు అజ్ఞాత వ్యక్తి నుంచి పరవాడ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు సంతబయలు వద్ద బస్సును ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా అధిక మోతాదులో మద్యం సేవించినట్టు నిర్ధారణ అయ్యింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. బస్సులను సీజ్‌చేసి కేసు నమోదు చేశారు. విద్యార్థులను మరో బస్సులో స్కూల్‌కు పంపారు.

వరహా నదిలో జారిపడి ఒకరి మృతి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుగొల్లు సమీపంలో వరహా నదిలో జారిపడి ఒకరు మృతిచెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. పెనుగొల్లు గ్రామానికి చెందిన పినపోతుల శ్రీను (40) మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జాతీయ రహదారిపై వరహా నది వంతెన మీదుగా ధర్మవరం అగ్రహారం వైపు నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు నదిలోలో దిగి గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ విభీషణరావు వెళ్లి, అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. నదిలో గాలించగా కొద్దిసేపటికి శ్రీను మృతదేహం లభ్యమైంది. భార్య శ్రీదేవి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్టు

పాయకరావుపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం జంక్షన్ వద్ద గత నెల 19వ తేదీన పోలీసులు పట్టుకున్న 200 కిలోల గంజాయి కేసులో మరో ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. ఈ కేసులో అప్పట్లో ముగ్గురిని అరెస్టు చేయగా, తాజాగా గొలుగొండ మండలం రావణాపల్లికి చెందిన గొర్ల అర్జున్, దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు.

900 మద్యం సీసాలు స్వాధీనం

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైన్ షాపు నుంచి బెల్ట్ దుకాణాలకు అక్రమంగా తరలిస్తున్న 900 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వరప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం స్థానిక వైన్ షాపు నుంచి మినీ వ్యాన్‌లో వివిధ గ్రామాల్లో ఉన్న బెల్ట్ దుకాణాలకు పంపిణీ చేసేందుకు నర్సీపట్నానికి చెందిన గాలి రామరాజు, సిరిబాలకు చెందిన రాడ ప్రసాద్‌లు మద్యం సీసాలను తరలిస్తున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులకు పట్టుబడడంతో మద్యం సీసాలు, మినీ వ్యాన్ సీజ్ చేశారు. నిందితులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు.

5న పవన్ కల్యాణ్ అరకులోయ రాక?

పాడేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఐదో తేదీన అరకులోయ రానున్నారని తెలిసింది. మాడగడ గ్రామ గిరిజనులు గత నెల 25న ప్రారంభించిన 12 రోజుల బలి ఉత్సవంలో పాల్గొనేందుకు ఆయన వస్తున్నట్టు సమాచారం. ఈ 'బలి ఉత్సవం'లో అల్లూరి సీతారామరాజు జిల్లాతోపాటు పార్వతీపురం మన్యం జిల్లా, సరిహద్దులోని ఒడిశా రాష్ట్రానికి చెందిన గిరిజనులు పాల్గొంటారు. దీంతో గిరిజనుల ఆహ్వానం మేరకు ఉత్సవం ఆఖరి రోజు కార్యక్రమానికి పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిసింది. అయితే అధికారికంగా డిప్యూటీ సీఎం కార్యక్రమాన్ని ప్రకటించలేదు.

ప్రతి 6 నెలలకు మారీటైమ్ సదస్సు

... 5వ పేజీ తరువాయి

సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. విశాఖపట్నం డేటా సెంటర్‌గా నంబర్‌వన్ స్థానంలో ఉంటుందని, ముంబై, బెంగళూరు నగరాలను తలదన్నే డేటా సెంటర్లు వస్తాయన్నారు. సింగపూర్ నుంచి సీ కేబుల్ వస్తుందని చెప్పారు. త్వరలో అమరావతికి బుల్లెట్ ట్రైన్ కూడా వస్తుందని చెప్పారు. స్టీల్ ఉత్పత్తుల రవాణా కోసం ప్రత్యేకంగా ఒక పోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. షిప్పింగ్ లైన్స్‌కు చెందిన త్రిపాఠి మాట్లాడుతూ, షిప్ రిపేర్లకు 200 నుంచి 300 ఎకరాలు కేటాయించాలని కోరగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

అనకాపల్లి వద్దు బాబోయ్!

... 5వ పేజీ తరువాయి

ఎంత నచ్చజెప్పినప్పటికీ ఆయన ససేమిరా అన్నట్టు సమాచారం. భాస్కర అప్పారావు స్థానంలో పాయకరావుపేట నుంచి డిప్యూటీ తహశీల్దారును నియమించారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన ఇన్‌చార్జి తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

చోడవరం సీహెచ్‌సీకి మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రిసెప్షన్ కౌంటర్, డాక్టర్లకు ప్రత్యేకంగా గదులు, మహిళలకు , పురుషులకు వేర్వేరుగా వార్డులు, పిల్లల వార్డు, ప్రసూతి వార్డు నిర్మించారు. ఎక్స్‌రే యూనిట్, ఈసీజీ, స్కానింగ్ అందుబాటులోకి వచ్చాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఐదేళ్లపాటు ఆస్పత్రిని పట్టించుకోలేదు. దీంతో ఎక్స్‌రే, ఈసీజీ, స్కానింగ్ సేవలు పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులోకి రాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే రూ.38 లక్షలతో పోస్టుమార్టం కేంద్రం నిర్మించారు. తాజాగా సీహెచ్‌సీని 30 పడకల నుంచి వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	121.00
లైవ్ ధర	141.00
విత్ స్కిన్	252.00
స్కిన్ లెస్	262.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579